VISALAANDHRA VIJAYAWADA Phone No 376

4 పేజీలు ఒక అణా రిజిష్టర్డు నెం. A 193

700204

విశాలాంధ్ర

సంపుటి 4 ★ విజయవాడ బుధవారం మార్చి 28; 1956 ★ సంచిక 367

విశాఖ నూనెశుద్ధి కార్మికుల సమ్మె

విశాఖపట్నం, మార్చి 27

విశాఖ నూనెశుద్ధి కర్మాగారంలో పనిచేస్తున్న 4,500 మంది కార్మికులు నిన్నటినుండి సమ్మె చేస్తున్నారు

వారి కోర్కెలలో కొన్ని ఇవి "బొంబాయిలున్న కంపెనీలో ఇస్తున్నట్లు జీతాలు ఇవ్వాలి తొలగించబడిన ఇరవైమంది కార్మికులను తిరిగి పనిలోకి చేర్చుకోవాలి" (పి టి)

ప్రజాతంత్ర దేశాలకు సమష్టి అణు పరిశోధనా కేంద్రం

మాస్కో, మార్చి 27

అణుశక్తి పరిశోధనకు సోవియట్‌లో ఒక సమష్టి పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పాలని యిక్కడ సమావేశమైన 11 కమ్యూనిస్టు దేశాల ప్రతినిధులు అంగీకరించారు ఈ సమావేశం నిన్నటితో అంతమైంది

విద్యుచ్ఛక్తిశాఖలో లక్షలాది విలువచేసే సామగ్రి గల్లంతు

ఆంధ్ర శాసనసభ చర్చలో కాంగ్రెసు సభ్యులతోసహా పలువురి నిశితవిమర్శ

◆◆◆

బాధ్యులైనవారిని తప్పకశిక్షిస్తామని మంత్రిహామీ:

పి. డబ్ల్యు. డి. శాఖలోని అవినీతి గురించివెల్లడి

(విశాలాంధ్ర విలేఖరి)

కర్నూలు, మార్చి 27

విద్యుచ్ఛక్తిశాఖ పద్దులపై నేడు శాసనసభ చర్చ సందర్భంలో కాంగ్రెసు సభ్యులతో సహా అనేకమంది ఆ శాఖలో పెరిగిన దుర్వ్యయాన్ని, అవినీతిని ఉదాహరణ తో సహా ఎత్తిచూపించారు సింహాచలంలో రు 40 లక్షలు వచేసే సామగ్రి గల్లంతు అయినదని శ్రీ ఎ సి సుబ్బా (కాం) బయటపెట్టారు. మంత్రి శ్రీ లచ్చన్నగారు కు జవాబు చెబుతూ ఈ దుర్వ్యయానికి కారకులైన తప్పక శిక్షిస్తామని అన్నారు.

చ్ఛక్తిశాఖా మంత్రి శ్రీ చ్చన్నగారు విద్యుచ్ఛక్తిశాఖ ల వ్యయం క్రింద ,42,000, రెవిన్యూ ఖాతా 1,08,94,600 సభవారి నికి ప్రవేశపెట్టారు

చ్చన్నగారు చర్చను ప్రారం ఆంధ్రరాష్ట్రం ఏర్పడేసరికి కుమాత్రమే విద్యుచ్ఛక్తి ఉండేవి, ఈ రెండున్నర లో 3663 గ్రామాలకు అద చ్చామని అన్నారు వచ్చే లో ఒక గ్రామం చొప్పున 3664 గ్రామాలకు విద్యుచ్ఛక్తి వచ్చే ట్లు చేయగలమన్నారు 1955మార్చి నుండి ఈమార్చివరకు ఇచ్చిన గ్రామాలకు 1 కోటి 52 లక్షల వ్యయంతో సుమారు 2406 మైళ్ళ తక్కువ శక్తి(ఎల్ టి) విద్యుచ్ఛక్తి తీగలువేశారని, మొత్తం 11 స్కీములు అమలు జరిగాయని అన్నారు అంతకు ముందు 1½ సంవత్సరాల్లోను 108 స్కీములు అమలు జరగాయన్నారు మాచ్ ఖండ్ ప్రాజెక్టులో మొదటిదశ నిర్మాణం పూర్తయిందని మొదటి టర్బైన్ పని ప్రారంభించిందని అన్నారు తుంగభద్రలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి డిసెంబరులో ప్రారంభమవుతుందనీ, ఇది పని ప్రారంభిస్తే 17 వేల కిలోవాట్ల శక్తిఉత్పత్తి అవుతుందనీ అన్నారు.

సీలేరు ప్రాజెక్టు ప్రాథమిక పరిశీలన పూర్తి అయిందనీ, త్వరలో పని ప్రారంభిస్తారనీ అన్నారు మంత్రులు తమ తమ ప్రాంతాల్లోనే స్కీములు అమలుజరిపించుకుంటున్నారన్న మాట పొరపాటని అన్ని ప్రాంతాలకు న్యాయం జరిగేటట్లు చూస్తున్నారని అన్నారు నెల్లూరు-కడప విద్యుచ్ఛక్తి లైనుకు 98 లక్షలు అవుతుందని అన్నారు

పద్దుపై చర్చలో పాల్గొన్న అన్ని పక్షాల సభ్యులు విద్యుచ్ఛక్తి శాఖలో జరుగుతున్న విపరీత దుబారాను, దుర్వ్యయాన్ని నిశితంగా విమర్శించారు

కాంగ్రెస్ సభ్యుడు శ్రీ ఎ సి సుబ్బారెడ్డిగారు తమ ప్రసంగంలో అనేక ఉదాహరణలు ఎత్తిచూపించారు ఆయన ఇలా అన్నారు

ఒక ఎలెక్ట్రిక్ స్తంభం వేయడానికి కంట్రాక్టర్లద్వారా రు 75 లు అవుతోంది ఈవిధంగా మదనపల్లిలో వ్యయపరిచారు కాని వాస్తవంగా స్తంభానికి రు 15ల కంటె ఎక్కువ అవదు ఈపద్ధతిని లక్షలకు లక్షలు కంట్రాక్టర్లు, ఉద్యోగులు కలిసి జేబుల్లో పోసుకుంటున్నారు చోడవరంలో రు 14 వేలు విలువచేసే రాగి తీగను ఒకమిల్లులో దాచివేశారు తరువాత ఇది బయటపడింది సబ్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ సాగింది కాని ఇందుకు బాధ్యులైన ఇంజనీర్లపై ఏమిచర్య తీసుకున్నారో ఇంతవరకు తేలలేదు

40 లక్షల విలువగల సామాగ్రి గల్లంతు

ఇదేవిధంగా సింహాచలంలోని సెంట్రల్ ఎలక్ట్రికల్ స్టోర్సులోరు 25 వేల విలువగల 6 టన్నుల రాగి తీగను జూనియర్ ఇంజనీరు కలకత్తా ఎగుమతి చేసుకున్నాడు మొదట ఇది జిల్లా స్టోర్సుగా మాత్రమే ఉండేది అందులో సుమారు రు 40 లక్షల విలువగల సామాగ్రి ఇంతవరకు అజ లేకుండా పోవడంతో, దీనిని కప్పిపెట్టడానికి సెంట్రల్ స్టోర్సుగా చేశారు ఈ శాఖలో అదుపు ఆజ్ఞలు లేకుండా పోయాయి

మాచ్ ఖండ్ లైనులో పెందుర్తి నుండి గొల్లప్రోలువరకు 11 కిలోవాట్ల లైను 1½ మైళ్ళు వరకు మంజూరు చేయకుండా వేశారు అనుమతిలేకపోవడం వలన తిరిగి దానినంతా ఊడబెరికారు

రు 25 వేల లోపు కంట్రాక్టులను టెండర్లు పిలవకుండానే అధికారులు కాంట్రాక్టర్ల కివ్వవచ్చును దీని అవకాశంగా తీసుకొని అధికారులు, కంట్రాక్టర్లు కలిసి ప్రజాధనాన్ని దిగమింగుతున్నారు కోటాను కోట్ల డబ్బు దుర్వ్యయం అవుతోంది"

శ్రీ చిదంబరరెడ్డి మాట్లాడుతూ "రాయలసీమ, విశాఖ ప్రాంతాలకు విద్యుచ్ఛక్తి చాలా అవసరం చిత్తూరులో 60 వేల బావులు, అనంతపురంలో 50వేల బావులు ఉన్నాయి 50 అడుగుల లోతు నుండి నీరు తోడుకోవలసి ఉంటుంది ముఖ్యంగా దక్షిణ ప్రాంతాన ఉన్న తాలూకాల్లో బావులకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయవలసిన అవసరం చాలా ఉంది రాష్ట్రంలో మొత్తం 118 స్కీములను మంజూరుచేశామన్నారు కానిఅనంతపురంజిల్లాలో ఏస్కీములేదు బుక్కపట్నం-పెనుకొండ విద్యుచ్ఛక్తి లైనువేయడం కూడా అవసర"మన్నారు

అనంతపురం జిల్లాకు చెందిన మరో 10 మంది సభ్యులు మాట్లాడుతూ జిల్లాలకు విద్యుత్ సరఫరా ఆవశ్యకతను తెలిపారు

తాత్కాలిక పనివారిస్థితి

తరువాత శ్రీ ఉలవాపు లక్ష్మణదాసుగారు మాట్లాడుతూ విశాఖ, రాయలసీమ ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యత యివ్వాలన్నారు

శ్రీ బి జి ఎం ఎ నరసింగరావు (విశాఖ) మాట్లాడుతూ విద్యుచ్ఛక్తి శాఖలో సుమారు 10 సంవత్సరాల నుండి అనేక మందిని తాత్కాలిక పనివారుగ ఉంచుతున్నారనీ, వారిని ఖాయపరచాలనీ అన్నారు వీరిని తాత్కాలిక కార్మికులుగ ఉంచడం వలన వారికి చాల సౌకర్యాలు పోతున్నాయని అన్నారు లైనులపై పనిచేసేవారికి పనిగంటల నిర్ణయం ఉండటంలేదనీ, అదనపు పనికి అదనపు వేతనాలు యివ్వడంలేదని అన్నారు

విద్యుచ్ఛక్తి శాఖకున్న మోటారు వ్యానులు పల్లెటూళ్ళలో రవాణా సౌకర్యాలకోసం వినియోగించవలసి ఉండగా పట్టణాలలో మాత్రం వాటిని ఉద్యోగస్థులు వాడుతున్నారనీ, వారి భార్యాబిడ్డలు తిరగడానికి ఉపయోగిస్తున్నారనీ అన్నారు

విశాఖ, విజయవాడ థర్మల్ స్టేషన్ల, మాచ్ ఖండ్ విద్యుత్ శాఖ దంతో మూసివేశారనీ, ఈ రెండు కేంద్రాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ భవిష్యత్ గురించి ఆందోళన చెందుతున్నారనీ అందుచేత వీరికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు చూపాలని అన్నారు

చాలామందికి జీతాలు ఆరేసి నెలలకుగాని అందడంలేదని, జీతాల చట్టం వీరికి అనువర్తింపచేయాలని అన్నారు.

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు మాట్లాడుతూ ఉత్పత్తి అయిన విద్యుచ్ఛక్తిని పరిశ్రమలకు, వ్యవసాయానికి ఉపయోగించుకొనేందుకు తగిన అవకాశాలను ప్రభుత్వం కల్గించాలన్నారు

చర్చకు మంత్రి శ్రీ లచ్చన్నగారు జవాబు చెబుతూ అవినీతి గురించిన ఉదాహరణలు ఎత్తి చూపినందుకు సభ్యులను అభినందిస్తున్నామని అన్నారు సింహాచలం సెంట్రల్ స్టోర్సు ఉదంతం విచారణ చేయనక్కరలేదని డిపార్టుమెంటు ఉద్యోగులు 'నోట్' పెట్టారనీ, కాని తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఈ కేసును తిరగదోడి విచారణ జరిపిస్తున్నామని, ఇందుకుబాధ్యులైన ఉద్యోగులను తప్పక శిక్షిస్తామని అన్నారు ఇంకా ఇలా అన్నారు

పి డబ్ల్యు. డీ శాఖలోఅవినీతి

"ఎస్టిమేట్లు వేయడంలో విద్యుచ్ఛక్తిశాఖ ఛీఫ్ ఇంజనీయరు సరిగానే వ్యవహరిస్తున్నారని నమ్ముతున్నాము అయితే ఇది వివిధశాఖల్లో వివిధ రకాలుగ ఉంటోంది పి డబ్ల్యు డి శాఖవారు కనీసం నిర్మాణానికి ఎస్టిమేట్లు తయారుచేశారు మైలుకు రు 4 లక్షలు అవుతుందని అంచనా వేశారు ఇందులో కంట్రాక్టరుకు రు 60 వేలు వరకు మిగులుతుందంటున్నారు దీని గురించి ఇక నేను ఏమిచెప్పను ?

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రాంతానికి రైలుమార్గం వేయడానికి నిర్మించవలసిన కట్టకు రు 84 లక్షలు అవుతుందని ఛీఫ్ ఇంజనీరు అంచనా అయితే రైల్వేశాఖ రు 64 లక్షలని అంచనా వేసింది ఇదీ, ఎస్టిమేట్లు గురించిన ప్రస్తుత పరిస్థితి పి డబ్ల్యు డి శాఖ అంటే "పబ్లిక్ వేస్ట్ డిపార్టుమెంటు" అని రాజగోపాలాచారి అంటటివారే అన్నారు ప్రస్తుతం ఇది అల్లాగే వుంది

విద్యుచ్ఛక్తిశాఖలో ఈ ఎస్టిమేట్లను తయారుచేయడానికి ఛీఫ్ ఇంజనీయరు, ఆర్థికశాఖా కార్యదర్శి, పి డబ్ల్యు డి శాఖ కార్యదర్శులతో కమిటీ ఏర్పరిచాము రు 10 వేలకు మించితే ఈ కమిటీయే పరిశీలించి ఆమోదించాలి అందుచేత జాగ్రత్తగానే అంచనాలను వేసే సావకాశం ఉంది

విద్యుచ్ఛక్తి సరఫరాలో పరిశ్రమలకు మొదటి ప్రాధాన్యతా, వ్యవసాయానికి రెండవ ప్రాధాన్యతా యిస్తున్నాము విద్యుచ్ఛక్తి లైనులను వేయడంలో తక్కువ వ్యయంలో అందుబాటుగా ఉండే సమీప ప్రాంతాలన్నిటికి ముందు యిస్తున్నాము దూరప్రాంతాలకు అందించాలంటే వాటికి ఎక్కువ ఖర్చు అవుతుంది

రాజమండ్రి విద్యుత్ కార్పొరేషన్ రేట్లు ఎక్కువగా ఉన్నాయి ఏప్రిల్ 20 వ తేదీన కార్పొరేషన్ ప్రభుత్వస్వాధీనమవుతుంది అప్పుడు రేట్లను తగ్గించడానికి వీలు ఏర్పడుతుంది

నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రాంతానికి విద్యుచ్ఛక్తి లైనులు వేయడానికి రు 98 లక్షలు, గరివిడిలో స్థాపించబోయే ఫెర్రోమాంగనీస్ ఫ్యాక్టరీకి విద్యుచ్ఛక్తి అందించడానికి రు 75 లక్షలు ఖర్చు అవుతుంది ఈ ఖర్చు యివ్వాలని కేంద్రాన్ని అర్థించాము వచ్చేజూన్‌లో కేంద్రప్రభుత్వం ఇచ్చేదీ, లేనిదీ తెలుస్తుంది"

అమెరికా, కెనడా, మెక్సికో ప్రభుత్వాధిపతుల మంతనాలు

వర్జీనియా, మార్చి 26

కెనడా, మెక్సికో ప్రధాన మంత్రులతో ప్రత్యేక మంతనాల కోసం అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ ఈవేళ ఇక్కడికి వస్తున్నారు ఆ ఇద్దరు ప్రధానులూ ఈవేళ విమానాల్లో ఇక్కడికి వస్తున్నారు

అమెరికా విదేశాంగమంత్రి డల్లెస్, కెనడా విదేశాంగమంత్రి లెస్టర్ పియర్సన్, మెక్సికో విదేశాంగ మంత్రి లూయిపాడిల్లా నెర్వో కూడా ఈ సంభాషణల్లో పాల్గొంటారు

ఇంత హంగామాతో జరుగుతున్న ఈ సంభాషణలు "ఒకరినొకరు పరిచయం చేసుకోడానికి మాత్రమే" అని అమెరికా ప్రభుత్వాధికారుల ప్రచారం

కలకత్తాలోని అమెరికన్ కాన్సలేట్ నుంచి నేపాలుకు ఆయుధాల రవాణా

ప్రయివేటు సామాను పేరుతో ఒక వ్యక్తి పేర పంపుతున్నట్లు నేపాల్ పత్రిక వెల్లడి

(విశాలాంధ్ర విలేఖరి)

న్యూఢిల్లీ, మార్చి 24

కలకత్తాలోని అమెరికన్ కాన్సలేట్ కార్యాలయంనుంచి నేపాల్లో ఒకవ్యక్తికి ఆయుధాలు రహస్యంగా ఎగుమతి అవుతున్న ఉదంతం ఇప్పుడు బైటపడింది ఈ ఉదంతాన్ని గురించి "నేపాళ సందేశం" అనే నేపాళ పత్రిక ఇలా రాస్తోంది

పాట్నా విమానాశ్రయంలోని కస్టమ్సు అధికారులు ఇటీవల ఒక పెట్టెను పట్టుకొన్నారు ఆ పెట్టెలో ఒక తుపాకీ, మూడువేల తూటాలూ వున్నాయి ఈ పెట్టెను కలకత్తాలోని అమెరికన్ కాన్సలేట్ కార్యాలయం వారు ఖాట్మండూలోని అమెరికన్ ఆపరేషన్ మిషన్‌లో వున్న జాన్ బ్రిటన్ అనే వ్యక్తి పేరుతో రవాణా చేశారు ఇలాంటి పెట్టెలను అమెరికన్ కాన్సలేట్ కార్యాలయంవారు ఇంతకు ముందు కూడా చాలా పంపించినట్లు తెలుస్తోంది ఈ పెట్టెమీద "ప్రయివేటు సామాను" అని రాసివుంది ఇంతకు ముందు పంపిన పెట్టెలలో కూడా తుపాకులూ తోటాలూ వున్నాయని, ఈ ఘటననుబట్టి రూఢిగా అనుకుంటున్నారు

ఈజిప్ట్ ప్రధానితో సోవియట్ రాయబారి సంప్రతింపులు

కైరో, మార్చి 26

ఈజిప్టులోని సోవియట్ రాయబారి ఎఫెన్సీ కిస్లెవ్ ప్రధాని నాజర్‌ని నేడు ఆయన ఇంటివద్ద కలుసుకున్నారు ఈయన ఈ విధంగా కలుసుకోవడం ఈవారంరోజుల్లో ఇది రెండవసారి వీరిద్దరూ ఏయే విషయాలను గురించి మాట్లాడుకున్నారో సోవియట్ అధికారులుగాని, ఈజిప్ట్ వారుగాని చెప్పడంలేదు భద్రతా సంఘం ఎదుటనున్న అరబ్బు - ఇజ్రాయల్ సమస్యనుగురించి వీరుమాట్లాడుకున్నారని కైరోలోని దౌత్యవర్గాల వారు అంటున్నారు

కంబోడియా మంత్రివర్గం రాజీనామా

పారిస్, మార్చి 26

కంబోడియా ప్రధాని నరోదమ్ సిహనౌక్ తన మంత్రివర్గ రాజీనామాను రాజుకు సమర్పించినట్లు నాంపెన్‌నుంచి ఇక్కడికి వార్తలు వచ్చాయి

నరోదమ్ పార్టీకే కంబోడియా శాసనసభలో అన్ని స్థానాలూ వున్నాయి అయితే ఈ పార్టీలో కొన్ని విషయాలపై భేదాభిప్రాయాలు వచ్చినట్లు పరిశీలకులు భావిస్తున్నారు తాను ప్రధానిగా వున్నపుడు కొన్ని అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించలేక పోయానని నరోదమ్ తన రాజీనామాపత్రంలో పేర్కొన్నాడట

సోవియట్ - ఆఫ్ఘన్ విమాన ప్రయాణాల ఒడంబడిక

పెషావర్, మార్చి 26

ఆఫ్ఘనిస్తాన్ - సోవియట్ దేశాల మధ్య విమానాల రెగ్యులర్ సర్వీసుని ప్రారంభిస్తూ ఉభయదేశాలకూ ఒక ఒడంబడిక కుదిరింది ఒడంబడికపై కాబూల్లో సంతకాలు జరిగాయని కాబూల్ రేడియో తెలిపింది

కాబూల్ మీదుగా భారత సోవియట్ దేశాల మధ్య రెగ్యులర్ విమాన సర్వీసుని ఏర్పాటుచేస్తూ భారత, సోవియట్ ప్రభుత్వాలకు మూడుమాసాల క్రితం ఒడంబడిక కుదిరి, సంతకాలు జరిగిన విషయం పాఠకులకు తెలిసినదే

ట్యునీషియా ఎన్నికల్లో జాతీయ సంఘటన విజయం

ట్యునిస్, మార్చి 26

ట్యునీషియా ప్రథమ జనరల్ ఎన్నికలలో నియోదస్తూర్ పార్టీ నాయకత్వానగల జాతీయ సంఘటనకు పోటీ చేసిన అన్ని స్థానాలు లభించాయి

నిన్న జరిగిన ఎన్నికలలో తాత్కాలిక ఫలితాలు నేడు ప్రకటించబడ్డాయి 7,26,000 మంది ఓటర్లలో నూటికి 90 మంది ఓటుచేశారు శాసనసభలో మొత్తం 98 స్థానాలున్నాయి ఈ శాసనసభ ట్యునీషియా రాజ్యాంగాన్ని రచిస్తుంది. నియోదస్తూర్ పార్టీ నాయకుడు హబీబ్ బోర్గీబా కొత్త ప్రధాని కావచ్చు ననుకుంటున్నారు ట్యునీషియాకు స్వాతంత్ర్యం సంపాదించిన పారిస్ చర్చలలో ఈయన ప్రముఖ పాత్ర వహించారు.

నెహ్రూ - మికోయాన్‌ల సంప్రతింపులు

ప్రపంచ సమస్యలపై 2¾ గంటలపాటు

న్యూఢిల్లీ, మార్చి 26

భారత ప్రధాని శ్రీ నెహ్రూ, సోవియట్ ఉపప్రధాని మికోయాన్ నేడు రెండు గంటల 45 నిమిషాలపాటు సమావేశమై ప్రపంచ పరిస్థితులపై సంప్రతింపులు జరుపుకొన్నారు.

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ మహాసభ నిర్ణయాల దృష్ట్యా సోవియట్ ప్రభుత్వ విధానాల్లో వచ్చిన మార్పులను గురించి మికోయాన్ శ్రీ నెహ్రూకు వివరించినట్లు తెలుస్తోంది

ఇటీవల ఢిల్లీలో తాను అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ విదేశాంగ మంత్రులతో జరిపిన సంభాషణలను శ్రీ నెహ్రూ మికోయాన్‌కు వివరించారని కూడా తెలుస్తోంది.

నెహ్రూ-మికోయాన్ సమావేశానికి భారతవిదేశ వ్యవహారాల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ యన్ ఆర్ పిళ్ళే, భారతదేశంలోని సోవియట్ రాయబారి మెన్షికోవ్ హాజరయ్యారు

భారత - సోవియట్ దేశాలమధ్య ఆర్థికసహకారాన్ని పెంపొందించుకునే విషయంకూడా వారి సంభాషణలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది

మికోయాన్ సోవియట్ వాణిజ్య వ్యాపారంలో ఆరితేరిన వ్యక్తిగా ప్రసిద్ధిచెందారు రేపుఆయన వాణిజ్య మంత్రి శ్రీ కృష్ణమాచారిని కలుసుకొని భారత - సోవియట్ వాణిజ్యసమస్యలను గురించి వివరంగా చర్చిస్తారు బుధవారంనాడు ఆర్థిక మంత్రి శ్రీ దేశముఖ్‌తో సంప్రతింపులు జరుపుతారు

ఈవేళ రాత్రి మికోయాన్‌కు ప్రధాని నెహ్రూ విందు జరిపారు

మొట్టమొదట వారం రోజులపాటు భారతదేశంలో వుందామనుకొన్న మికోయాన్ తనకార్యక్రమాన్ని నాలుగు రోజులకు తగ్గించుకొన్నారు అందువలన ఆగ్రా, బీహారులను దర్శించడం మానివేస్తున్నారు

నెహ్రూ - మికోయాన్ హోలీ వినోదాలు

న్యూఢిల్లీ, మార్చి 27

ఢిల్లీలో హోలీపండగ ఎంతో సరదాగా జరిగింది

ప్రధాని నెహ్రూ, రాష్ట్రపతి రాజేంద్రప్రసాదులు తాము స్వయంగా పండగలో పాల్గొనడమే కాకుండా, రాష్ట్రపతి భవనంలో అతిథిగా ఉన్న సోవియట్ ప్రథమ ఉపప్రధాని అనస్తాస్ మికోయాన్ని కూడా ఈవినోదంలోకి దించారు

ఈ వేళ ఉదయాన్నే ప్రధాని నెహ్రూ, ఇందిరాగాంధీ, రాష్ట్రపతి భవనానికి వెళ్ళి రాజేంద్రప్రసాదుపై బుక్కా జల్లారు

ఆ తరువాత నెహ్రూ మికోయాన్ విడిదికి వెళ్ళి ఆయనమొహాన కొంత బుక్కా పూశారు

కేంద్ర వస్త్ర, పారిశ్రామికశాఖా మంత్రి శ్రీ టి టి కృష్ణమాచారితో సంప్రతింపులకు మికోయాన్ అప్పుడే బయలుదేరుతున్నారు అంతలోనే ప్రధాని నెహ్రూ బుక్కా పట్టుకొని ప్రత్యక్షమయారు నెహ్రూ వెంట పి ఐ బి ఫొటోగ్రాఫర్లు, మామూలు ఫొటోగ్రాఫర్లు చాలమందివచ్చి ఆ దృశ్యాన్ని రంగుల్లో ఫొటోలు తీశారు నెహ్రూముఖమూ, బట్టలూ అప్పటికే రకరకాలరంగులతో నిండిపోయాయి మికోయాన్ ఒక ఫొటోగ్రాఫరుని పిలిచి, అతను తీసిన ఫొటో కాపీ ఒకటి తన కివ్వమని కోరారు

హోలీపండగను గురించి మికోయాన్‌తో కొంత ముచ్చటించి నెహ్రూ తన ఇంటికి వెళ్ళారు మికోయాన్ కృష్ణమాచారి వద్దకు వెళ్లారు

నెహ్రూ ఇంటికి చేరుకొనే సరికి, అక్కడ మామూలు బంట్రోతు మొదలుకొని, ప్రధాన కార్యదర్శి వరకు అందరూ రంగురంగుల బుక్కాలతోనూ, పూలదండలతోనూ, సిద్ధమయి, ఆయన వచ్చీరాగానే రంగుల్లోనూ, దండలతోనూ ముంచెత్తారు

గరివిడిలో ఫెర్రోమాంగనీస్ ఫ్యాక్టరీ స్థాపన కనుమతి

కేంద్రం యిచ్చినట్లు రాష్ట్ర శాసనసభలో పరిశ్రమల మంత్రి వెంకటరావుగారి వెల్లడి

కర్నూలు, మార్చి 27

శ్రీకాకుళంజిల్లా గరివిడిలో 1 కోటి 50 లక్షల వ్యయంతో ఒక ఫెర్రో మాంగనీస్ ఫ్యాక్టరీని నెలకొల్పడానికి ఒకప్రైవేటుసంస్థకు కేంద్రప్రభుత్వం అనుమతియిచ్చిందని ప్రణాళికశాఖా మంత్రి కళా వెంకట్రావుగారు నేడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో తెలియజేశారు.

లైసెన్సు షరతుల ప్రకారం ఈ ఫ్యాక్టరీని 1957 మార్చి నాటికి స్థాపించాలని ఆయన అన్నారు

అంబర్ చర్ఖాలు

దాదాపు 200 అంబర్ చర్ఖాలను ఆరు చేనేత సహకారసంఘాలకు అందజేశామనీ, కొద్దికాలం పోయినతర్వాత ఇవి ఏవిధంగా పనిచేస్తున్నాయో తెలుస్తుందని శ్రీ కళా వెంకట్రావుగారు మరో ప్రశ్నకు సమాధానం యిచ్చారు ఈస్కీము జయప్రదమైతే సుమారు లక్ష అంబర్ చర్ఖాలు ఆంధ్రకు కావలసి వుంటాయని, పెద్దయెత్తున చర్ఖాలను తయారుచేస్తే ఉత్పత్తి ఖర్చులు రు 70 నుండి 50 వరకు తగ్గుతాయని అన్నారు

పాలపొడి ఫ్యాక్టరీలు

ఆంధ్రలో పాలపొడి ఫ్యాక్టరీలను స్థాపించాలనే పథకాన్ని రెండవపంచవర్ష ప్రణాళికలో చేర్చారని ముఖ్యమంత్రి గోపాలరెడ్డిగారు తెలియజేశారు పథకం తయారు చేయడం యింకా పూర్తికాలేదనీ, యీ ఫ్యాక్టరీలు వ్యక్తి యాజమాన్యంలో వుంటాయనిచెప్పారు

పట్టు ఉత్పత్తి కేంద్రాలు

రాష్ట్రంలో వున్న నాలుగు పట్టు ఉత్పత్తి కేంద్రాలూ వ్యక్తియాజమాన్యంలోనే వున్నాయని పరిశ్రమల మంత్రి శ్రీ కళా వెంకటరావుగారు తెలియజేశారు ఎవరైనా కొత్త కేంద్రాన్ని స్థాపించదలిస్తే ప్రభుత్వం వారికి ప్రోత్సాహమిస్తుందనిచెప్పారు నాలుగు కేంద్రాలలోనూ కలిపి 54 - 55 లో 1769 పౌనుల పట్టు ఉత్పత్తి అయిందన్నారు

ఆందోళనా దృక్పథం విడనాడండి

బొంబాయిపై మహారాష్ట్రులకు శ్రీ శంకర్రావ్‌దేవ్ విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 26

బొంబాయి సమస్యపై మహారాష్ట్రులంతా ఆందోళనా దృక్పథాన్ని విరమించి, మహారాష్ట్రేతరుల సుహృద్భావాన్ని సంపాదించుకునేందుకు ఇకనుండి తీవ్రంగా కృషి చేయాలని శ్రీ శంకర్రావుదేవ్ నేడొక పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

శ్రీ శంకర్రావ్ దేవ్ ప్రధాన మంత్రిని కలుసుకొనేందుకు ఢిల్లీ బయలుదేరి వెళ్ళడానికి అకోలనుండి ఇక్కడికి వచ్చారు

అకోలలో జరిగిన సర్వసేవాసంఘ సమావేశంలో ఆయన సంయుక్త మహారాష్ట్ర సమస్యను గురించి ఆచార్య వినోబా, జయప్రకాశ్ నారాయణ గార్లతో సంప్రతింపులు జరిపారు

బొంబాయినగరం మహారాష్ట్రకే చెందాలని వినోబా, జయప్రకాశ్‌లు గట్టిగా అభిప్రాయపడుతున్నారని, ఇది మహారాష్ట్రులకు నైతికంగా బలాన్ని చేకూర్చిందని శ్రీ దేవ్ తన ప్రకటనలో పేర్కొన్నారు

1956 మార్చి 28 బుధవారం
మన్మథనామ సంవత్సర
మాఘ బహుళ
విదియ సా. 5-36
చిత్త మ. 2-1

విశాలాంధ్ర
బుధవారం 28-3-56

ముఖ్యమంత్రి సమాధానం

ఆంధ్ర శాసనసభలో సప్లిమెంటరీ డిమాండ్లపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ ముఖ్యమంత్రి గోపాలరెడ్డిగారు, ధనాభావంవలన ప్రభుత్వం ఏ కార్యక్రమాలనూ చేపట్ట లేకుండా ఉన్నదని తెలియజేశారు రాష్ట్రానికి ఈనాటికే 70 కోట్ల రూపాయల అప్పు ఉన్నదని, ద్వితీయ ప్రణాళికా నిర్వహణకు అదనంగా ధనం అవసరమని, కనుక అధిక పన్నులు తప్పవనికూడా అన్నారు

డబ్బులేదు అనే పేరుతో ప్రజోపయోగ కార్యక్రమాలన్నిటికి ఆటంకాలు కలిగించటం, ఆంధ్ర మంత్రివర్గానికి, అందులోను ముఖ్యమంత్రికి పరిపాటి ఐపోయింది ఏదోవిధంగా ఆదాయాన్ని వ్యయాన్ని సరిపెట్టి యథాతథ పరిస్థితిని కొనసాగించాలనే, ఈ మనస్తత్వం మారనంతవరకూ ప్రభుత్వానికి లోటు బడ్జెటులు తప్పవు. ద్వితీయ ప్రణాళిక లక్ష్యాలను సాధించడం కష్టతరమౌతుంది.

డబ్బులేదు అనే గోపాలరెడ్డిగారివాదన పూర్తిగా అర్థరహితమని, ఏ మాత్రం పరిశీలించినా బోధపడగలదు. నిజంగా ఆదాయాన్ని పెంచుకోవాలనే సంకల్పం ప్రభుత్వానికి ఉంటే, ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న అనవసర వ్యయాన్ని, దుబారా ఖర్చును ఎందుకు తగ్గించరాదని ప్రశ్నిస్తున్నాము ?

రాష్ట్ర ప్రభుత్వం గవర్నరు జీతభత్యాలక్రింద, ఇతరఖర్చుల క్రింద కొన్ని లక్షలను ఖర్చు చేస్తున్నది. అమ్మకంపన్నును సమర్థవంతంగా వసూలు చేసుకోవటం చేతకాక మరికొన్ని కోట్లు పోగొట్టుకుంటున్నది. అంతేకాదు శాసనసభ ప్రతిపక్షనాయకులు సుందరయ్యగారు సూచించినట్లు, ధన సేకరణకు అనేక మార్గాలున్నాయి. పరిశ్రమాధిపతుల లాభాలలో నూటికి 6 వంతులు వదలి మిగతా డబ్బును పరిశ్రమలలో పెట్టుబడికై కేటాయించవచ్చు జమీందార్లకిచ్చే నష్టపరిహారం వాయిదావేయవచ్చు. ఉద్యోగుల సాలుసరి ఆదాయాన్ని 20 వేలకు పరిమితంచేసి, ఆపైన వచ్చే ఆదాయాన్ని జాతీయాభివృద్ధి ప్రణాళికలకై సేకరించవచ్చు

ప్రతిపక్షం పై సూచనలను ఎన్నో సందర్భాలలో చేస్తూ వచ్చింది. కాని ప్రచారమనే పేరుతో పై సూచనలన్నిటినీ ప్రభుత్వం త్రోసివేస్తున్నది లోటు బడ్జెటు పూడ్చుకునే పేరుతో, ప్రజాసామాన్యంపై భారంపడేవిధంగా పన్నులు విధించడానికి మాత్రం, ఆంధ్ర ప్రభుత్వం ముందుకు వస్తున్నది ధనికవర్గాలపైన, భూస్వాములపైన భారంమోపడానికిబదులు, ప్రజలపై భారంమోపేవిధంగా పన్నులు విధించే నేటి ప్రభుత్వ విధానం మారాలి.

అంతేకాదు, ద్వితీయప్రణాళికలో భూసమస్యకు ఒక పరిష్కారమార్గం సూచించబడ్డది కౌలుకేటును నిర్ణయించి, ప్రభుత్వమే ఆకౌలును వసూలు చేయాలని, భూపరిమితి నిర్ణయించి, అదనపు భూమిని పేద రైతులకు దక్కేటట్లుచేయాలని ద్వితీయప్రణాళిక ముసాయిదా సూచిస్తున్నది ఆ ప్రణాళికలోని సూచనలను అమలు జరిపినట్లయితే రైతాంగం యొక్క ఆదాయం పెరిగి, వారి కొనుగోలుశక్తి వృద్ధికాగలదు

కనుకనే ప్లానింగు కమిషన్ సూచించిన మేరకైనా భూసంస్కరణలను అమలు జరపవలసిందిగా, ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు కోరాయి. అలా అమలుజరుపటంలో తాము పూర్తిగా సహకరిస్తామనికూడా వారు తెలియజేశారు. కొన్ని స్వల్పమార్పులతో, స్థానిక పరిస్థితులకు తగినట్లు ప్లానింగ్ కమిషన్ సూచించిన భూసంస్కరణలను అమలు జరుపుతామని, ప్రణాళికా మంత్రి వెంకట్రావుగారు తెలిపారు. ఇదెంతవరకు ఆచరణలో పెట్టబడుతుందో చూడాలసివుంది

ద్వితీయ ప్రణాళిక లక్ష్యాలు ఆంధ్రలో జయప్రదం కావాలంటే, ముఖ్యమంత్రి గోపాలరెడ్డిగారు వెలిబుచ్చే 'డబ్బులేదు' అనే వాదనను, ఆంధ్ర ప్రభుత్వంవిడనాడాలి. ప్లానింగ్ కమిషన్ సూచించినమేరకైనా భూసంస్కరణలను అమలు జరపటానికి పూనుకోవాలి ఖర్చు తగ్గించుకోవటానికి, ఆదాయాన్ని పెంచుకోటానికి ప్రతిపక్షంవారు చేసిన సూచనలను స్వీకరించాలి.

చైనాలో నీటి నిలువ పథకాలు

నిరుడుకన్నా ఈ ఏడు రెట్టింపు ఖర్చు

లండన్, మార్చి 26

నీటి నిలువ పథకాల క్రింద చైనా ప్రభుత్వం ఈ సంవత్సరం నిరుడుకన్నా రెండింతలు ఖర్చుపెట్ట నిశ్చయించిందని చైనా నీటి పొదుపులశాఖ అధికారి నేడు తెలిపారు

ఈ సంవత్సరం కూడా హువాయ్ హోనది మీదనే ఎక్కువగా కేంద్రీకరిస్తారట ఆ నదిమీద ఇదివరకే ఆరు పెద్దపెద్ద రిజర్వాయర్లను కట్టారు పంచవర్షంలో ఏడవదానిని పూర్తి చేయుటమో, మరి రెండింటిని ప్రారంభించడమో జరుగుతుందట

నది దిగువభాగంలోనూ, ఉపనదుల్లోనూ పూడిక తవ్వి, ఇంకా లోతు చేయడం ఈ సంవత్సరంలో కూడా చురుకుగా సాగుతుందన్నారు దీని ఫలితంగా, ఈ ఏడాది పూర్తయేలోగా ఈనది ఎంత పెద్దవరదవచ్చినా సరే తట్టుకోగలుగుతుందన్నారు

ఇదే సమయంలో పచ్చనది మీద సాన్మెన్‌గోర్జి వద్ద మొదటి రిజర్వాయరు కట్టడానికి సన్నాహాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి

మొత్తంమీద 45 నదులను, కాలువలను అదుపులోకి తేవడానికి ప్లానులు ఈ సంవత్సరంలో పూర్తి అవుతాయని ఈ ఉద్యోగి తెలిపారు

బ్రిటనులో అంతర్భాగంగా మాల్టా

లండన్, మార్చి 26

ప్రస్తుతం బ్రిటిష్ వలసప్రాంతంగా ఉన్న మాల్టా దీవిని బ్రిటనులో అంతర్భాగంగా పరిగణించాలనీ, మాల్టా నుండి బ్రిటిష్ పార్లమెంటుకి ముగ్గురు ప్రతినిధుల్ని ఎన్నుకోవాలనీ ప్రభుత్వం తెచ్చిన ఒక ప్రతిపాదనను బ్రిటిష్ కామన్సుసభలో నేడు ప్రతిపక్షంవారుకూడా బలపరిచారు దీనిపై ఓటింగు జరగలేదుగాని కామన్సుసభ దీనిని ఆమోదించినట్లే భావిస్తున్నారు

ఎయిడెడ్ స్కూళ్లలో సర్వీసు భద్రత

ఉపాధ్యాయ సంఘం తరఫున విద్యాశాఖ కార్యదర్శికి వినతి

కర్నూలు, మార్చి 26

ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ సింగరాజు రామకృష్ణయ్యగారు ఈ నెల 21 వ తేదీన కర్నూలులో విద్యాశాఖ కార్యదర్శిని కలుసుకొని ఎలిమెంటరీ స్కూళ్ళ ఉపాధ్యాయులకు సర్వీసు భద్రత కలిగించాలని కోరుతూ ఒక వినతిపత్రం సమర్పించారు

నెల్లూరు ఆర్ఫనేజ్ హయ్యర్ ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయుడు శ్రీ ఎ ధనరాజ్, పొదిలి తాలూకా సిద్ధవరం ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయిని శ్రీమతి రూథమ్మ, తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరం ఆది ఆంధ్ర ఎయిడెడ్ స్కూలు (నంబరు 1) ఉపాధ్యాయుడు శ్రీ శీలం భూషణం, కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా వేముర్తిపాడు ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయుడు శ్రీ టి వెంకటరత్నంగార్లను సర్వీసునుంచి తొలగించడాన్ని ఉదాహరిస్తూ, ఎయిడెడ్ స్కూలు ఉపాధ్యాయుల పరిస్థితి దినకూలీల పరిస్థితికంటె అధ్వాన్నంగా ఉందని తెలియజేశారు స్కూలు మేనేజిమెంట్లను ప్రభుత్వం స్వాధీనపరచుకొని జిల్లాలలో ఉపాధ్యాయులను నియమించే అధికారం, తొలగించే అధికారం వెంటనే విద్యాశాఖవారే తీసుకోవాలని సూచించారు

విద్యాశాఖ కార్యదర్శి ఆయా వ్యక్తుల కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు వారివద్దనుండి రిపోర్టులు తెప్పించుకొని, అందరి సర్వీసుకు తగు భద్రత కలిగించే విషయమై చర్యతీసుకొంటామని చెప్పారు

ఎలిమెంటరీస్కూళ్ల నిబంధనలలో చెప్పినట్లు టీచర్ల పోస్టులను నిర్ణయించవలసిందిగా అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు సలహా ఇవ్వాలనే విషయం ప్రస్తావించారు. నిబంధనలకు వ్యతిరేకంగా పోస్టుల నిర్ణయం జరిగివుంటే తగ్గించిన పోస్టులను పునరుద్ధరించేట్లు చర్యతీసుకొంటామన్నారు.

ఫెడరేషన్ కార్యకలాపాలలో పాల్గొంటున్నందుకు కృష్ణా, పశ్చిమ గోదావరిజిల్లాలలో అయిదుగురుఉపాధ్యాయులను ఒక మేనేజరును జిల్లా విద్యాశాఖాధికారులు బెదరించారని వినతిపత్రంలో పేర్కొన్నారు ఆయా అధికారులనుండి వివరాలు తెప్పించుకొని ఈవిషయమై తగుచర్య తీసుకొంటామని విద్యాశాఖకార్యదర్శి చెప్పారు

రాష్ట్రం మొత్తంమీద బోర్డు, ఎయిడెడ్ స్కూళ్ళకు జీతాలు అందించడంలో చాల ఆలస్యం జరుగుతున్నదని, 1956 జనవరి గ్రాంట్లు ఇవ్వక పోవడంవల్ల ఎయిడెడ్ స్కూలు ఉపాధ్యాయులు చెప్పనలవికాని బాధలు పడుతున్నారని వినతిపత్రంలో తెలియజేశారు ఈ సమస్యపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకరింపబడి వుందని, జీతాలు త్వరగా అందజేసే పద్ధతులు సూచింపవలసిందిగా తాము విద్యాశాఖ డైరక్టరుకు వ్రాశామని విద్యాశాఖ కార్యదర్శి చెప్పారు 1956 జనవరి జీతాలు త్వరగా అందించే ఏర్పాట్లు చేస్తామని మాట ఇచ్చారు ఆర్థిక ఇబ్బందులవల్ల విశాఖ జిల్లాలోస్కూళ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోదని విద్యాశాఖ కార్యదర్శి అన్నారు

నెల్లూరుజిల్లాలో స్కూలు మేనేజర్లు కొందరు తమ పలుకుబడి కింద వున్న వారితో కమిటీలు ఏర్పరచి, తమ స్కూళ్ళు బాగా నడుస్తున్నాయని గుర్తింపు చేయించుకోడానికై తంటాలు పడుతున్నారని వినతిపత్రంలో తెలియజేశారు

కుప్పుస్వామి కమిటీ సిఫారసుల మేరకు అన్ని షరతులను సంతృప్తికరంగా పాటించనిదే స్కూలు మేనేజిమెంట్లకు ఎలాంటి మినహాయింపు ఇవ్వకూడదని కోరారు (వి వి)

వయోజన విద్యా కేంద్రాలకు గ్రాంట్లు ఆపివేత

కర్నూలు, మార్చి 26

వయోజన విద్యాకేంద్రాలకు వచ్చే స్కూలు సంవత్సరంనుండి (1956-57) ప్రభుత్వం గ్రాంట్లు ఆపివేస్తుందని, సప్లిమెంటరీ డిమాండ్లపై చర్చకు సమాధానమిస్తూ నేడు శాసనసభలో గోపాలరెడ్డిగారు తెలియజేశారు

(వి వి)

బట్టలమిల్లులకు చేనేతకు పోటీ ఉండకూడదు

సహజసంపదల శాఖామంత్రి శ్రీ మాళవీయ స్పష్టీకరణ

ఇండోర్, మార్చి 26

భారతదేశానికి ఇదివరకు ప్రతి సంవత్సరం 100 కోట్ల గజాలబట్ట దిగుమతి అయ్యేది నేడు మన జవుళి పరిశ్రమ అభివృద్ధి చెందడంవలన 1955 నాటికి 50 లక్షల గజాలు మాత్రమే దిగుమతి అవుతూంది. దీనికి మన స్వాతంత్ర్య పోరాటం, విదేశీవస్తు బహిష్కరణ ఉద్యమాలు ఒక ప్రధాన కారణం రెండు ప్రపంచ యుద్ధాల పర్యవసానంగా పరిశ్రమాభివృద్ధికిగల్గిన అవకాశాలు రెండవ ప్రధానకారణమని సహజ సంపదల శాఖామంత్రి శ్రీ కె డి మాళవీయ నిన్న యిక్కడ అన్నారు

అఖిలభారత జవుళి పరిశ్రమ, 8 వ మహాసభను ప్రారంభిస్తూ శ్రీ మాళవీయ పైవిధంగా అన్నారు ఆయన తమ ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు

జవుళి పరిశ్రమ స్థిరత్వం సంపాదించింది. ఇంకా అభివృద్ధిపొందే దశలో ఉంది. రేషనలైజేషన్ వగైరా సమస్యల గురించి, కొత్త ఉత్పత్తి పద్ధతుల గురించి పరిశీలించే దశలో ఉంది

బట్టల మిల్లులు, చేనేత పరిశ్రమ చేసే ఉత్పత్తి ఇంచుమించుగ 680 కోట్ల గజాలవరకు ఉంటున్నది. గత నాల్గయిదు ఏళ్లలోను ఇది చాల గణనీయమైన అభివృద్ధే నని చెప్పాలి. కాని ప్రజల సంపదమీదనే బట్ట వినిమయంకూడా ఆధారపడి వుంటుంది అయితే ఉత్పత్తి అధికం గావడానికి ఇదొక్కటే కారణంగాదు ఇరుగుపొరుగు దేశాల్లో ప్రతిష్ట, తత్ఫలితంగా అభివృద్ధిపొందే మన ఎగుమతులమీద కూడా మన సాంకేతికాభివృద్ధి ఆధారపడి వుంటుంది

దాన్ని ఎక్కువగా అభివృద్ధి చేయవలసినదశలో మన పరిశ్రమ ఉన్నది దేశంలో వివిధ ప్రాంతాలలోవున్న జవుళిపరిశోధన కేంద్రాలు ఇందుకు తోడ్పడతాయి

మనదేశం తాదసంబంధమైన రంగులను 5 కోట్లున్నలవరకు దిగుమతి చేసుకుంటున్నది

ప్రభుత్వం ఇటీవలనే రంగుల ఉత్పత్తికేంద్రాన్ని స్థాపించింది బట్టల మిల్లులకు, చేనేత పరిశ్రమకు చెప్పుకోతగినంతవరకు రంగులను అందించగల్గుతోంది

జవుళి మిల్లులకు, చేనేత పరిశ్రమకు మధ్య పోటీ ఉన్నట్టు ఎంచడం సరికాదు. దేశ పురోభివృద్ధి దృష్ట్యా, విశాల ప్రయోజనాల దృష్ట్యా చూడాలి ఈ రెండింటికి మధ్యపోటీ ఎంత మాత్రం ఉండరాదని ప్రభుత్వం నిర్ణయించింది

దేశాభివృద్ధి పరిణామదశలో పనులు కల్పించే దృష్టితో ఈ పోటీ సమస్యను పరిష్కరించాలి ఎక్కువ నూలుమిల్లులు స్థాపించాలా లేదా అనే సమస్యను ఎక్కువ మందికి పనులు కల్గించుతుందా లేదా అనే దృష్ట్యా పరిశీలించాలి

కొరత పరిస్థితులు సంభవించడానికి, అంతరంగిక మార్కెట్ పెరగడంవలన ఎగుమతులు పడిపోడానికి కూడా ఒక్కొక్కసారి దారితీసే ప్రమాదం ఉన్నప్పటికీ వికేంద్రీకరణ పద్ధతిని చేనేత పరిశ్రమ ద్వారాగాని లేక నూలు ఉత్పత్తి కేంద్రాల ద్వారాగాని పనులు కల్పించవలసిన ప్రాముఖ్యతను మరచిపోకూడదు ఈదృష్ట్యానే మనకు అవసరమైన 800 కోట్ల గజాల బట్ట ఉత్పత్తిని మిల్లులకు చేనేతకు ఎంతెంత కేటాయించాలో చూడవలసి ఉంది

జవుళి పరిశ్రమలో అతి నవీనమైన సాంకేతిక అభివృద్ధిని ప్రవేశపెట్టవలసిన అవసరం ఉన్నప్పటికీ దీనిని ఒంటెద్దు దృక్పథంతో చూడకూడదు చేనేత పరిశ్రమద్వారా కూడా ఇంకా చాలాకాలం జీవనమార్గం సాధ్యమని మన ప్రజలకు అభయం యివ్వవలసి ఉంటుంది

పరిశ్రమలను సాంకేతికంగా అభివృద్ధిచేయడం వలన మిగిలిపోయే అదనపు కార్మికులకు పనులు చూపించవలసిన అవసరం ఉంది కాని యిదివరకే పనులు కల్గివున్న వారిని నిరుద్యోగులను చేయరాదనే మన అంతిమలక్ష్యం ఉన్నపుడు మనం ఆందోళన చెందవలసిన అగత్యం ఏమివుంది ?

అన్ని సమస్యలను సామాజిక దృష్టితో చూడవలసిందని, ఏదో ఒక పరిశ్రమ దృష్ట్యానే చూడవద్దని కోరుతున్నాను

సభాధ్యక్షత వహించిన కేంద్ర జవుళి కమిషనర్ శ్రీ నంజప్ప మాట్లాడుతూ మన ఎగుమతి వ్యాపారాభివృద్ధి దృష్ట్యాను, దేశంలో తక్కువ ధరకు నాణ్యమైన బట్టను లభింపచేసే దృష్ట్యాను నవీన యంత్రాలను అవశ్యం ప్రవేశపెట్టాలని అన్నారు మన ప్రత్యర్థులు అతి నవీన యంత్రాల ద్వారా ఉత్పత్తి చేస్తున్నప్పుడు మనం పాత యంత్రాలమీద ఆధారపడి లాభం లేదన్నారు సాంకేతిక ప్రవీణులు ఉత్పత్తి పెంచడంలో ఎంతో కృషి చేశారని వారిని అందుకు ఎంతో అభినందించుచున్నానని అన్నారు

భద్రతా సంఘంలో అరబ్బు-ఇజ్రాయల్ సమస్యపై చర్చ వాయిదా

న్యూయార్కు, మార్చి 26

పడమటి ఆసియాలోని ఉద్రిక్త పరిస్థితిని గురించి ఐరాస ప్రధాన కార్యదర్శి హామర్షెల్డ్ దర్యాప్తు చేయాలంటూ అమెరికా చేసిన ప్రతిపాదనపై చర్చను భద్రతా సంఘం వచ్చే బుధవారంనాటికి వాయిదా వేసింది ఇలా వాయిదా వేయాలని ఇరాన్ ప్రతినిధి ప్రతిపాదించారు

ఈ విషయమై చర్చలలో పాల్గొనే అవకాశాలు తమకుకూడా కలిగించాలని కోరుతూ, ఇజ్రాయల్ పొరుగునున్న నాలుగు అరబ్బు దేశాల ప్రతినిధులూ భద్రతా సంఘం అధ్యక్షునికి లేఖలు అందజేశారు.

ఇజ్రాయల్ కూడా ఇలాంటి అవకాశాన్నే కోరిందని నేడు భద్రతాసంఘ సమావేశంలో అధ్యక్షుడు సర్ పియర్సన్ డిక్సన్ తెలిపారు

ఈ విషయమై చర్చ లేకుండానే ఈ అయిదు దేశాల ప్రతినిధులనూ చర్చలకు ఆహ్వానించారు

భారత కమ్యూనిస్టుపార్టీ మహాసభ సన్నాహాలు

సభాస్థలికి వందమైళ్లువున్న కయ్యూరు నుండిఅంచెలవారీగాఅరుణపతాకోత్సవం

పాలఘాట్, మార్చి 26

అఖిలభారత కమ్యూనిస్టుపార్టీ నాలుగవ మహాసభను దిగ్విజయం చేయడానికై ఇక్కడ విపులసన్నాహాలు చేస్తున్నారు. మలబారులో, తిరువాన్కూరు-కొచ్చి రాష్ట్రంలో దాదాపు 20,000 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు ఈ పనులలో నిమగ్నమైవున్నారు.

మహాసభ ఏప్రిల్ 19 నుండి 29 వ తేదీవరకు ఇక్కడ జరుగుతుంది కార్యకర్తలు మహాసభ ఖర్చులకోసం విరాళాలు వసూలు చేస్తున్నారు ఆఖరురోజు జరిగే కవాతులో పాల్గొనడానికై "రెడ్ వలంటీర్లు" శిక్షణ పొందుతున్నారు మహాసభ కార్యక్రమాన్ని వివరించే పోస్టర్లు, బ్యానర్లు, బోర్డులు అచ్చువేస్తున్నారు కమ్యూనిస్టుపార్టీ సభ్యులు,మిత్రులే కాకుండా కష్టజీవులైన ప్రజలుకూడ ఆహ్వాన సంఘానికి తోడ్పడుతున్నారు దేశం నలుమూలలనుండి కేరళకు వచ్చే ప్రతినిధులకు ఉచితరీతిని స్వాగతం ఇవ్వాలని కుతూహలపడుతున్నారు ఒక రాజకీయపార్టీ కేరళలో అఖిలభారత మహాసభ జరుపుకోవడం ఇదే మొదటిసారి అందువల్ల కేరళ ప్రజలు ఈ మహోత్సవాన్ని జాతీయ పర్వదినముగా భావిస్తున్నారు

సాంస్కృతిక ఉత్సవం, ప్రదర్శనలు

ప్రతినిధుల సభల ఏర్పాట్లే కాకుండా, ఏప్రిల్ 15 నుండి మే 1 వ తేదీ వరకు అఖిలభారత వస్తు ప్రదర్శనం, ఏప్రిల్ 18 నుండి 27 వ తేదీవరకు సాంస్కృతిక ఉత్సవం, ఏప్రిల్ 29 వ తేదీన 10,000 మంది "రెడ్‌వలంటీర్ల కవాతు" ఏర్పాటు చేస్తున్నారు కవాతు బహిరంగసభకు ముందు జరుగుతుంది అఖిలభారత వస్తుప్రదర్శనంలో పారిశ్రామిక, వర్తక సంస్థలన్నీ పాల్గొనవచ్చు వందసంవత్సరాలలో ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం ఎలా పెరిగిందో తెలియజేసేందుకు ప్రత్యేకంగా ఒక ప్రదర్శనశాలను నిర్మిస్తున్నారు కేరళ ప్రజల అభ్యున్నతిని గురించి, భారతదేశం గతంలో ఎలా వుండేదో ఇప్పుడు ఎలా వుందో, ఇకముందు ఎలా వుంటుందో తెలియజేసే చిత్రాలు, చార్టులు అలంకరించబడతాయి పెట్టుబడిదారీ, సోషలిస్టు ప్రపంచాల ఉనికిని తెలియజేసే చిత్రాలు, చార్టులు ప్రదర్శనంలో పెడతారు పదిరోజులపాటు జరిగే సాంస్కృతిక ఉత్సవంలో కేరళ ప్రజల ప్రాచీన సాంస్కృతిక వైభవాన్ని, కేరళ ప్రజల వినూత్న సంస్కృతినీ ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు కమ్యూనిస్టుపార్టీ చరిత్రలోనే కాక, భారతదేశంలో మరే రాజకీయపార్టీ చరిత్రలో కూడ కనీవిని ఎరుగని విధంగా 10,000 మందితో "రెడ్‌వలంటీర్ల కవాతు" జరుగుతుంది

గత ఆరు నెలలలో దేశవ్యాపితంగా స్థానిక, జిల్లా (లేక తాలూకా) రాష్ట్ర మహాసభలు జరిగాయి ఆ తరువాతనే పార్టీ నాలుగవ మహాసభ జరుగుతున్నది మలబార్ పార్టీ మహాసభ జనవరి ఆఖరువారం మాహేలోను, తిరువాన్కూర్-కొచిన్ రాష్ట్ర మహాసభ ఫిబ్రవరి రెండవవారంలోనూ జరిగాయి. ఈ మహాసభలు జాతీయ పర్వదినాలుగా వుండిపోయాయి మలబారు మహాసభ చివరిరోజున 2,500 మంది రెడ్‌వలంటీర్లతో కవాతు జరిగింది 80,000 మంది ప్రజలు బహిరంగసభకు హాజరయ్యారు. ఆ రాత్రంతా వైజ్ఞానిక ప్రదర్శనలు జరిగాయి తిరువాన్కూరు-కొచిన్ మహాసభ సందర్భంలో నాలుగు రోజులపాటు సాంస్కృతిక ఉత్సవం జరిగింది ప్రతిరోజు వేలాది ప్రజలు హాజరయ్యారు ఆఖరిరోజున (ఫిబ్రవరి 12 వ తేదీ) 5,000 మంది రెడ్‌వలంటీర్లతో గొప్పఊరేగింపు జరిగింది బహిరంగ సభకు మూడులక్షల మంది ప్రజలు హాజరయ్యారు తిరుకొచ్చి రాష్ట్ర ఆధునిక చరిత్రలో ఇదొక అపూర్వఘట్టం దీనినిబట్టి పార్టీ నాలుగవ మహాసభ ఎలావుండబోతుందో ఊహించుకోవచ్చు శాంతి, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, జాతీయ పురోగమనం కోసం కేరళలో ప్రజా సమీకరణ పెద్ద ఎత్తున జరుగనున్నది

అరుణపతాకోత్సవ సన్నాహం

స్వాతంత్ర్య, ప్రజాస్వామ్యాల కోసం, కష్టజీవుల హక్కుల కోసం ప్రాణాలను ఒడ్డిన వీరుల జన్మభూమి కేరళ కాసర్‌గోడ్ తాలూకాలో రైతులను సమీకరించి పోరాటాలు నడిపిన నలుగురు కయ్యూరు వీరులకు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు 1942లో మరణశిక్ష విధించారు కయ్యూరు వీరులు మార్చి 29 వ తేదీన కన్ననూరు సెంట్రల్ జైలులో ఉరితీయబడ్డారు మార్చి 29 వ తేదీ "కయ్యూరు అమర వీరులదినం"గా పరిగణించబడుతున్నది కేరళకు ఉత్తరాన చివరి భాగంలో కయ్యూరు గ్రామం వుంది కయ్యూరుకు, పార్టీ మహాసభ జరిగే పాలఘాట్‌కూ వంద మైళ్ళు దూరం వుంటుంది

పార్టీ మహాసభకై నిర్మించిన 'నగర్'లో ఏప్రిల్ 19 వ తేదీ ఉదయం మహాసభ ప్రారంభ సూచికంగా అరుణపతాకాన్ని ఎగురవేస్తారు పతాకం ఒక తాలూకానుండి ఇంకొక తాలూకాకు అంచెలవారిగా వస్తుంది కయ్యూరునుండి రెడ్‌వలంటీర్లు అరుణ పతాకాన్ని తీసుకొని వస్తారు అరుణ పతాకంతో రెడ్‌వలంటీర్లు మార్చి 29 వ తేదీన కయ్యూరునుండి బయలుదేరి, ఏప్రిల్ 18 వ తేదీకి పాలఘాట్ చేరుకొంటారు

ఈ కార్యక్రమం ప్రకటించినదే తడవుగా, అరుణపతాకం బయలుదేరే మార్గంలోవున్న కమ్యూనిస్టు పార్టీ కమిటీలు, ప్రజలూ ఎదురేగి పతాకాన్ని ఆహ్వానించడానికై సన్నాహాలు చేస్తున్నారు జాతీయ సంప్రదాయం ప్రకారం తప్పెట వాయిద్యాలు, వగైరాలతో అరుణపతాకాన్ని ఆహ్వానిస్తారు

పర్లాకిమిడి ఒరిస్సాలోనే వుండాలట

ముఖ్యమంత్రి నవకృష్ణచౌదరి వాదన

కర్నూలు, మార్చి 26

వివిధ రాష్ట్రాలమధ్య సరిహద్దులను చక్కబర్చటానికి ఇది తగిన సమయం కాదని ఒరిస్సా ముఖ్యమంత్రి శ్రీ నవకృష్ణ చౌదరీ నేడిక్కడ పత్రికా విలేఖరులతో అన్నారు రాష్ట్రాల పునర్నిర్మాణం పూర్తి అయిన తర్వాత, వాతావరణం చక్కబడినప్పుడు ఈ సమస్యను తీసుకోవచ్చునన్నారు

అన్నిరాష్ట్రాలలో భాషా మైనారిటీలకు రక్షణలు రాష్ట్రాల బిల్లులో పొందుపరచబడినందున, ఇక సరిహద్దు తగాదాలు వాటంతటవి పరిష్కారం అవుతాయని ఆశిస్తానన్నారు

పర్లాకిమిడినిగురించి ప్రశ్నించగా, పర్లాకిమిడి తాలూకాను తీసుకుంటే ఆంధ్రులు మైనారిటీగా వున్నారన్నారు పరిపాలనా సౌకర్యం దృష్ట్యాకూడా పర్లాకిమిడి ఒరిస్సాలో వుండాలన్నారు

భాషారాష్ట్రాలలో తనకు నమ్మకం లేదని శ్రీ చౌదరీ చెప్పారు ఒరిస్సా-ఆంధ్రరాష్ట్రాలు కలవాలంటారా అని అడగ్గా, భాషా రాష్ట్రాలు విజయవంతమవుతాయనే ఆశ తనకు లేదన్నారు బెంగాల్, బీహారులు కూడా కొన్ని హామీలను కోరుతున్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.

"బొంబాయి జాతీయ నగరం"

రాష్ట్రాల పునర్నిర్మాణ ముసాయిదా బిల్లు పై శ్రీ మొరార్జి ప్రసంగం

బొంబాయి, మార్చి 27

ముఖ్యమంత్రి శ్రీ మొరార్జిదేశాయి ఈవేళ బొంబాయిలెజిస్లేటివ్ కౌన్సిల్ లో రాష్ట్రాల పునర్నిర్మాణ ముసాయిదా బిల్లు ప్రతిపాదిస్తూ, బొంబాయిని "జాతీయనగరము"ని పేర్కొన్నారు ఏకభాషా రాష్ట్రానికి దానిని దత్తంచేస్తే, దేశంలోని ఇతర భాగాలకు అది తోడ్పడజాలదన్నారు

దేశ ఆర్థిక పరిణామానికి, స్థిరత్వానికి చాలవరకు బొంబాయి నగరం కారణమైందన్నారు. అందుచేత పునర్నిర్మాణం సందర్భంలో దాని భవిష్యత్తును గురించిప్రత్యేకంగా ఆలోచించవలసివుంటుందన్నారు మహారాష్ట్రకే కాకుండా, గుజరాత్, సౌరాష్ట్ర, కచ్ రాష్ట్రాలకు, భారతదేశంలోని ఇతర భాగాలకు కూడా బొంబాయి అవసరం ఎంతో కలదన్నారు బొంబాయి బహు భాషారాష్ట్రంలో వున్నంతవరకు ఎలాంటి చిక్కు వుండదన్నారు ఒకవేళ బొంబాయిని ఏకభాషా రాష్ట్రానికి దత్తం చేస్తే, ఇతర భాగాలకు అది తోడ్పడజాలదన్నారు బొంబాయినగరాన్ని మహారాష్ట్రకు దక్కనీకుండా చేస్తారనే సమస్య లేనేలేదు అది మహారాష్ట్రకే తోడ్పడుతుందికాని, ఇతరులకు తోడ్పడదని భావిస్తే అది సరైన కోర్కె కాదన్నారు

జనరల్ భీమా జాతీయకరణ

అఖిల భారత సంఘం విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 26

జనరల్ భీమాను కూడ జాతీయం చేయాలని కోరుతూ అఖిలభారతభీమా ఉద్యోగుల సంఘం జనరల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు ఈ సమావేశం ఇక్కడ మార్చి 22, 23, 24 తేదీలలో జరిగింది

పార్లమెంటు సెలక్టుకమిటీకి సమర్పించేనిమిత్తం జీవితభీమా కార్పొరేషన్ బిల్లుపై సభవారు ఒక మెమొరాండంతయారు చేశారు

క్రీడారంగం

మెల్బోర్నుకు భారతీయ ఫుటుబాల్ జట్టు

హైదరాబాదు, మార్చి 25

మెల్బోర్నులో జరిగే ఒలింపిక్స్ పోటీలకు భారతదేశం తరఫున ఒక ఫుట్ బాల్ జట్టును పంపడానికి నేడిక్కడ సమావేశమైన అఖిలభారత ఫుట్ బాల్ సమాఖ్య నిర్ణయించింది ఆగష్టు 15 నుండి సెప్టెంబరు 7 వ తేదీవరకు నేషనల్ ఛాంపియన్‌షిప్ ఫుట్ బాల్ పోటీలను జరపాలని కూడా తీర్మానించింది ఈ పోటీలు ఢిల్లీలోగాని, త్రివేండ్రంలోగాని జరుగుతాయి

ఫుట్ బాల్ ఆట ఆడే కాలాన్ని క్రమేణా 60 నిముషాల నుండి 90 నిముషాలకు పెంచాలని ఫెడరేషన్ వారు నిర్ణయించారు నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలను, ఇతర ముఖ్యమైన పోటీల సందర్భంలోనూ ఆటకాలాన్ని 70 నిముషాలకు పెంచాలని సర్క్యులర్ పంపాలని నిర్ణయించారు

బొంబాయిలో పదిమంది అరెస్టు

బొంబాయితో సంయుక్త మహారాష్ట్రకోసం నినాదాలు

బొంబాయి, మార్చి 2[illegible]

నిషేధాజ్ఞలను ధిక్కరించి బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ [illegible] వైపు ఊరేగింపు తీయ ప్రయత్నించినందుకు ఈవేళ పదిమందిని [illegible] చేశారు బొంబాయి ప్రదేశ్ కాం[illegible] కమిటీ మాజీసభ్యుడు శ్రీ బాబు[illegible] ఘోలప్ ఊరేగింపుదార్లకు నా[illegible] వహించారు. రాష్ట్రాల పునర్ని[illegible] బిల్లుపై చర్చ జరుగుతుండగా [illegible] గింపుదార్లు కౌన్సిల్ హాలువైపు పోయారు

సంయుక్త మహారాష్ట్ర కాం[illegible] పరిషత్తు, అఖిలపక్ష సంయుక్త మహారాష్ట్ర సమితివారల పిలుపునం[illegible] ఈఊరేగింపు జరిగింది [illegible] గింపుదార్లు "బొం[illegible] నగరంతో సంయుక్త మహా[illegible] కావాలి", "మొరార్జీ మంత్రివర్గం రాజీనామా ఇచ్చితీరాలి" [illegible] లిచ్చారు

అఖిలభారత హిందూమహాసభ ప్రధాన కార్యదర్శి శ్రీ వి జి దేశపాండే, నాయకత్వాన పన్నెండుగురితోకూడిన మరోదళం ఆప్రాంతంలోకి అడుగుపెట్టగానే పోలీసులు వారిని పట్టుకొన్నారు. పోలీసు వ్యాన్లలో వారినిఎక్కించుకొనిపోతుండగా వెయ్యిమంది అక్కడ సమికూడారు సంయుక్త మహారాష్ట్రకు అనుకూలంగాను, మొరార్జీదేశాయికి వ్యతిరేకంగాను నినాదాలిచ్చారు, తరువాత పోలీసుల విజ్ఞప్తిని పాటించి వారు వెళ్లిపోయారు

సవిమర్శకంగా చరిత్ర పరిశీలన

భవిష్యత్తులో పొరపాట్లు జరగకుండా ఉండేందుకు అవసరమని మికోయాన్

కరాచీ, మార్చి 26

"సోవియట్ వ్యవస్థకు ఒక ముఖ్యమైన పునాది విమర్శ సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ఇటీవలి మహాసభ ఈవిమర్శక దృష్టితోనే పరిస్థితినంతటినీ సింహావలోకనం చేసింది గతంలో జరిగిన పొరపాట్లు భవిష్యత్తులో పునరావృత్తం కాకుండా ఉండాలంటే, చారిత్రక ఘటనలను సవిమర్శకంగా అవగాహన చేసుకోవడం సహజంగా అవసరం స్టాలిన్ సాధించింది చాలా ఉంది అయితే ఆయన కొన్ని పొరపాట్లు కూడా చేశారు," అని సోవియట్ ప్రథమ ఉపప్రధాని అనాస్టాస్ మికోయాన్, కరాచీలో జరిగిన విందులో పత్రికావిలేఖరులతో ప్రసంగిస్తూ అన్నారు (ఈ గోష్ఠిని గురించి నిన్న కొంత ప్రచురించాము - సం)

పాకిస్తాన్ మంత్రులతో వర్తక సంప్రతింపులేమైనా జరిపారా అని విలేఖరులు అడిగారు అటువంటి సంప్రతింపులేవీ జరుగలేదనీ, అసలా ప్రసక్తి ఎవరూ తేలేదనీ మికోయాన్ అన్నారు "అడిగినవారికే మేము సహాయం అందజేస్తాము అంతేగాని, మా సహాయాన్ని ఎవరిమీదా బలవంతంగారుద్దము,"అని ఆయన అన్నారు

పరిశ్రమల కేంద్రాలు

కేంద్ర ప్రభుత్వంచే ఇప్పటికి పదిచోట్ల మంజూరు

న్యూఢిల్లీ, మార్చి 25

భారత ప్రభుత్వం ఇప్పటివరకు పరిశ్రమల కేంద్రాలు పదింటిని మంజూరు చేసింది. ఇవి రాజకోట (సౌరాష్ట్ర), ఓఖ్లా (ఢిల్లీ), గిండీ (మద్రాసు), విరుధునగర్ (మద్రాసు) కళ్యాణి (పశ్చిమబెంగాల్), మైసూరు, ఆగ్రా, కాన్పూరు, క్విలన్ (తిరుకొచ్చి), పాలఘాట్-మలంపూజ (మలబారు) లలో నెలకొల్పబడతాయి వీటికి సుమారు 4 కోట్ల, 48 లక్షల రూపాయలు ఖర్చవుతాయి వీటికి కావలసిన భూమికూడ అమరింది రాజకోట, ఓఖ్లాలలో ఇదివరకే నిర్మాణం ప్రారంభమైంది ఆయా రాష్ట్రాల దీర్ఘకాలఋణంకింద, వీటికయ్యేఖర్చును కేంద్రప్రభుత్వమే భరిస్తుంది

బజారు ధరలు

విజయవాడ, మార్చి 27

(మధ్యాహ్నం గం. 1 వరకు)

బంగారం ధరలు

మేలిమి పొట్లా	106	0	0
మాసా	105	8	0
సవరను	68	0	0
వెండి 100 తులములు	178	0	0
1 తులము	1	13	6

ధాన్యం ధరలు

[illegible]	26	0	0
[illegible]	24	0	0
[illegible]	28	8	0
[illegible]	28	8	0
[illegible]	28	4	0
[illegible]	28	4	0

బియ్యం ధరలు

[illegible]	59	0	0
[illegible]	58	8	0
[illegible]	52	8	0
[illegible]	52	8	0
[illegible]	52	0	0
[illegible]	52	0	0

అపరాల ధరలు

[illegible] 240 సేరులు	56	4	0
[illegible]	55	8	0
పెసలు (మాగాణి)	42	0	0
పచ్చ పెసలు 230 సే॥	48	8	0
పచ్చ పెసలు (మెట్టవి)	48	0	0
సెనగలు (దేశవాళీ)	38	0	0
సెనగలు (పంజాబు)	35	0	0
ధనియాలు 90 సేరులు	32	0	0
ఉలవలు	31	8	0
ఆముదాలు	38	0	0
పంచదార (ఉయ్యూరు)	38	5	8
బెల్లం మణుగు 3 8 0	4	8	0
మిర్చి (సైజాం) ,, 17-0-0	19	0	0
మిర్చి దేశవాళీ ,,	23	0	0
నీరుల్లి ,, 1-4-0	1	8	0
తెల్లుల్లి ,,	6	8	0
చింతపండు (మణుగు) 5/-	6	8	0
నువ్వుల నూనె (మణుగు)	21	0	0
కొబ్బరినూనె డబ్బా	25	10	0
వేరుసెనగపప్పు 177సే॥ 56-4/	57	4	0
,, నూనె మణుగు	15	14	0
,, చెక్క 160 సే॥	14	8	0
,, మద్దిపిండి 160 సే॥	17	0	0
కొబ్బరికాయలు 1,000	140	0	0
పసుపు పుట్టి	230	0	0
[illegible] 100	104	0	0
,, కార్వస్థ	100	8	0

రాష్ట్రపతి పాలనకు బాధ్యత

ప్రతిపక్షంవారిపై నెట్టుతూ శ్రీ గోవిందమీనన్ ప్రసంగం

త్రిచూరు, మార్చి 25

తిరుకొచ్చి మాజీముఖ్యమంత్రి శ్రీ పనంపల్లిగోవిందమీనన్ నేడిక్కడ ఒక బహిరంగసభలో ఉపన్యసిస్తూ, తిరుకొచ్చిలో రాష్ట్రపతి పాలన రావడానికి ప్రతిపక్ష సభ్యులు, తిరుగుబాటుదార్లయిన ఆరుగురు కాంగ్రెసు సభ్యులు, శాసనసభ్యుల బాధ్యతారహితమైన వైఖరి అందుకు ముఖ్యకారణమన్నారు

తిరుగుబాటుదార్లయిన ఆరుగురు కాంగ్రెసు సభ్యుల వైఖరి కాంగ్రెసు సంస్థ మొత్తానికే అవమానకరమన్నారు శాసనసభ్యులు రాష్ట్రాల పునర్నిర్మాణ బిల్లును చర్చించవలసిన సమయంలో, ద్వితీయ పంచవర్ష ప్రణాళికలోకి అడుగుపెట్టే సమయంలో తిరుగుబాటుదార్లు తమకేగాక బలీయమైన కాంగ్రెసుసంస్థకే కళంకం కలిగించారన్నారు

శాసనసభ్యులలో చాలమంది తరచు పార్టీలు మారుస్తూ, తాము ఓటర్లకిచ్చిన వాగ్దానాలను మరచిపోయారని, ఇలాంటి బాధ్యతారహిత వైఖరి ప్రజాస్వామిక యుగంలో క్షంతవ్యం కాదని శ్రీమీనన్ అన్నారు పార్టీతో వారికి ఏదైనా భేదాభిప్రాయం వుంటే లెజిస్లేచర్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా ఇవ్వడంతో సరిపెట్టుకోకూడదు పైపెచ్చు శాసన సభ్యత్వానికి రాజీనామా ఇచ్చేపాటి దమ్ములుకూడ వారికి వుండాలి అని శ్రీ మీనన్ అన్నారు

రాష్ట్రపతి పాలనను ఆహ్వానించడానికి కాంగ్రెసు కారణమైందని ప్రతిపక్షంవారు చేసే ఆరోపణను ప్రస్తావించి, కాంగ్రెసువలె ప్రతిపక్షంవారు కూడ అందుకు సమానంగానే బాధ్యత వహిస్తారన్నారు. [illegible] పరిపాలన రాకుండా చేయాలని వారు నిజంగా కోరుతున్నట్లయితే, వారు ఖచ్చితంగా కాంగ్రెసు పార్టీని బలపరచి వుండవలసిందన్నారు

పాక్‌దేశపటంలో కాశ్మీర్, జునాగడ్‌లు

సింగపూర్, మార్చి 25

పాకిస్తాన్ వర్తకప్రతినిధి ఇక్కడ విడుదలచేసిన భారత పాక్ దేశపటంలో జునాగడ్ కూడా పాకిస్తాన్ అంతర్భాగంగా వుంది

పాకిస్తాన్ ప్రాంతాన్ని ముదురు ఆకుపచ్చరంగులో చూపించారు కాశ్మీరు ప్రాంతాన్ని లేతఆకుపచ్చగా చూపించారు

ఈ దేశపటాన్ని పాక్ రిపబ్లిక్ అవతరణ దినోత్సవ సందర్భాన డెయిలీ మెయిల్ అనే పత్రిక ప్రచురించింది ఈ పత్రిక యజమాని భారతీయుడు

ఈ దేశ పటంలోవున్న తప్పును భారత హైకమిషనర్ కార్యాలయం వారు పత్రికాధిపతుల దృష్టికి తెచ్చారు ఆ దేశ పటం తమకు పాక్ వర్తక ప్రతినిధి కార్యాలయం నుంచి అందిందనీ దాన్ని అజాగ్రత్తగా ప్రచురించినందుకు చింతిస్తున్నామనీ పత్రికాధిపతులంటారు

* * *

యువరాజు కరణ్‌సింగ్ ఏప్రిల్ 3 వ తేదీన ఢిల్లీలో అఖిలభారత కర్షక యువకుల మహాసభకు ప్రారంభోత్సవం జరుపుతారు.

NEW ARRIVALS-

THE NEWCOMER (Short Novel) Galina Nikolayeva	168	0—7—0
COLLECTIVE FARM SIDELIGHTS (Short Stories) Valentine Ovechkin	208	0—6—0
WE ARE VERY HAPPY HERE (Photo review of a kindergarden)	32	0—3—0
WAGES, PRICE AND PROFIT By Marx	98	0—2—0
WAGE LABOUR AND CAPITAL By Marx	78	0—2—0
RESULTS OF THE FIRST FIVE YEAR PLAN By Stalin	64	0—3—0

Postage extra

Available at

Visalaandhra Publishing House, Vijayawada-2

and

People's Book House, Hyderabad (DN)

రాజ్యాంగానికి అనుగుణ్యమైన విద్యా నిబంధనలు అవసరం

కృష్ణాజిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ జనరల్ కౌన్సిలు తీర్మానం

తేలప్రోలు, మార్చి 20

కృష్ణాజిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ జనరలు కౌన్సిలు సమావేశము యీనెల 17 18 తేదీలలో గన్నవరం తాలూకా తేలప్రోలులో సంఘాధ్యక్షులు శ్రీ దేవరం వెంకట్రామయ్య గారి అధ్యక్షతను జరిగింది

ఉపాధ్యాయ పత్రికా సంపాదకులు, ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ సహాయకార్యదర్శి శ్రీవి విజయరామరాజుగారుసమావేశమును ప్రారంభించారు.

సమావేశమునకు ముందు డాక్టరు మేఘనాధసాహా, ఆచార్య నరేంద్రదేవ్, స్పీకర్ మవలంకరుగార్ల మృతికి సంతాపమును తెలియజేస్తూ తీర్మానించారు. సభ్యులు 2 నిముషములపాటు మౌనమును పాటించి మృతవీరులకు భక్త్యాంజలి ఘటించారు.

శ్రీ వి విజయరామరాజుగారు వివిధ ఆంధ్ర జిల్లాలలోని ప్రాథమికోపాధ్యాయులు తమ జిల్లా సంఘాల నాయకత్వాన, తమ సమస్యలను ఎట్లా పరిష్కరించుకొని పురోగమించుచున్నది తమ ఉపన్యాసంలో తెలియజేశారు. కార్యకర్తలు త్యాగనిరతితో, కష్టములను లెక్కచేయకుండా, రూల్సును తెలుసుకుంటూ, ఉపాధ్యాయులను అభివృద్ధిపరచి ఉద్యమాన్ని నిర్మించుకొంటూ, పత్రికను పోషించుకొంటూ, ఉద్యమ పురోగమనానికి కృషిచేయవలసినదిగా ఉద్బోధించారు.

తర్వాత 1954 మార్చి మొదటితేదీ నుంచి గత నెల 29 వరకు ఉద్యమాన్ని సమీక్షిస్తూ కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదిక జమాఖర్చులు ఆమోదించబడ్డాయి

అనంతరం ఈ క్రింది తీర్మానాలు ఆమోదించబడ్డాయి

గన్నవరము రేంజి ప్రాథమికోపాధ్యాయుల గ్రాంట్లను క్రమవిరుద్ధముగా నెలలతరబడి ఆపు చేసి, అనేక క్రమవిరుద్ధ చర్యలద్వారా ఉపాధ్యాయులను బాధించిన విద్యాశాఖాధికారులిద్దరిలో శ్రీ పశ్చిమ కృష్ణాజిల్లా డి ఇ ఓ గారిని ట్రాన్సుఫరుచేసినందులకు ఆంధ్ర ప్రభుత్వము వారిని అభినందిస్తూ, గన్నవరము రేంజి సీనియరు డిప్యూటీ యిన్స్పెక్టరుగారిని కూడ వెంటనే దూరప్రాంతాలకు ట్రాన్సుఫరుచేసి, యీ యిద్దరు విద్యాశాఖాధికారుల అన్యాయ చర్యలను ఋజువు చేసుకొనుటకు బహిరంగ విచారణ జరుపవలసినదిగా ఆంధ్ర ప్రభుత్వము వారిని అభ్యర్థించుచు ఒక తీర్మానము ఆమోదించబడింది

రాష్ట్ర ఫెడరేషను సవరణలలో కుప్పుస్వామి కమిటీ నివేదికను అమలు జరుపాలని, ఆంధ్రరాష్ట్రాభివృద్ధికి రెండవ పంచవర్ష ప్రణాళికలో రు 40 కోట్ల రూపాయలనైనా మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల ప్రాథమిక హక్కులను నిరాకరించే విద్యా నిబంధనలను రాజ్యాంగచట్టానికి అనుగుణ్యముగా తిరిగి వ్రాయాలని, శ్రీ [illegible] గారిని సర్వీసు జీతాలతో తిరిగి మేనేజిమెంటు నియమించునట్లు ఉత్తరువుల జారీచేయాలని, గ్రాంటుకోతలను, యీ నాటి రిట్రెంచిమెంటును ఉపసంహరించుకోవాలని వివిధ తీర్మానములు ఆమోదించబడ్డాయి

శ్రీ దేవరం వెంకట్రామయ్య, శ్రీ ఎస్ సీతారామాచారిగారలను అధ్యక్ష కార్యదర్శులుగా 17 మందితో నూతన కార్యనిర్వాహక వర్గమును ఎన్నుకున్నారు 12 మంది రాష్ట్ర కౌన్సిలు సభ్యులుగా యెన్నుకోబడ్డారు

మొగ్గలిపుత్త పవిత్రాస్థికలు

సింహళానికి బహూకరణ

కలకత్తా, మార్చి 25

మొగ్గలిపుత్త పవిత్రాస్థికలలో కొంతభాగాన్ని భారతప్రభుత్వం సింహళానికి బహూకరించింది బర్మాలో జరుగుతున్న బౌద్ధ పరిషత్తుకు వాటిని తీసుకొని పోతారు.

ఢిల్లీలోని సింహళ హైకమిషనర్ విజయరత్న, ఆయన సతీమణి వాటిని ఇక్కడికి తీసుకొని వచ్చారు రంగూన్‌కు వెళ్ళుతూ వారు ఇక్కడదిగారు.

గోవా విముక్తికి అమెరికన్‌చేయూత

పాకిస్తాన్‌తో అమెరికా సైనిక ఒడంబడిక ఖండన

న్యూఢిల్లీ, మార్చి 25

అమెరికాలో 'యునైటెడ్ ఆటో మొబైల్ వర్కర్సు' సంస్థ అధ్యక్షుడు వాల్టర్ పి రూథర్, గోవా విముక్తికై భారతదేశం తరఫున అమెరికా నిలబడాలని విదేశాంగమంత్రి డల్లెస్‌కు విజ్ఞప్తిచేశారు

శనివారంనాడు ఆయన డల్లెస్‌కు ఒక వినతి పత్రం సమర్పించారు దక్షిణ, ఆగ్నేయాసియాలపట్ల అమెరికా విధానాలను పునరాలోచించుకోవలసి వుంటుందని అందులో కోరారు. పాకిస్తాన్, తదితర రాజ్యాలతో అమెరికా సైనికఒడంబడిక చేసుకోవడాన్ని ఖండించారు

భారత జాతీయ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ఆహ్వానంపై రూథర్ ఏప్రిల్ 8 వ తేదీన భారతదేశానికి వస్తున్నారు భారతదేశంలో ఆయన ఏప్రిల్ 15 వరకు వుంటారు.

రేవుల అభివృద్ధి

62 28 కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ, మార్చి 25

ద్వితీయ ప్రణాళికలో రేవుల అభివృద్ధికిగాను రు 62 28 కోట్లను కేటాయించారు ప్రథమ ప్రణాళికలో రు 36కోట్లు కేటాయించగా 26కోట్లు ఖర్చు అయింది

చిన్న రేవుల అభివృద్ధికి ద్వితీయ ప్రణాళిక కాలంలో 5 కోట్లు కేటాయించారు

అస్సాం స్త్రీలలో బీడీత్రాగుడు

శాసనసభలో కాంగ్రెసుసభ్యుని ప్రస్తావన

షిల్లాంగ్, మార్చి 24

అస్సాం స్త్రీలలో చాలమంది స్త్రీలు బీడీత్రాగుడుకు అలవాటు పడ్డారని, ఇది చాల శోచనీయమైన విషయమని కాంగ్రెసుసభ్యుడు శ్రీ హేమచంద్ర హజారికా ఈవేళ అస్సాం శాసనసభలో చెప్పారు 'హుక్కా'కు జాతీయ జీవనంలో తగినంత ప్రతిష్ఠ వుండేదని, దానిని పునరుద్ధరించాలని కోరారు

బీడీలపై పన్ను పెంచరాదని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ గౌరీకంతర భట్టాచార్య అన్నారు బీడీ ఉత్పత్తిదార్లు ఆకర్షణకోసం బడి పిల్లలకు ఉచితంగా బీడీలు పంచి పెట్టడం ప్రారంభించారని కాంగ్రెసు సభ్యుడు శ్రీ విశ్వదేవశర్మ తెలియజేశారు

ఆర్థికమంత్రి శ్రీ మోతీరామ్ బారువా బడిపిల్లలకు బీడీలు పంచిపెట్టడంపట్ల ఆందోళన వెలిబుచ్చారు దీనిని అరికట్టేందుకై అవసరమైన చర్యలు తీసుకొంటామన్నారు

పారిశ్రామికంగా మద్రాసు వెనుకబడి లేదు

శ్రీ కె. సంతానం వివరణ

మధుర, మార్చి 25

"మద్రాసులో రైలుపెట్టెలనిర్మాణ కార్మాగారం ఉంది మద్రాసు హార్బరు విస్తరణ కార్యక్రమం జరుగుతోంది. రైల్వే రవాణాకూడా విస్తరించుచున్నది ఇవన్నీ చూసుకుంటే పరిశ్రమాభివృద్ధి విషయంలో మద్రాసుకు అన్యాయం జరిగిందనుకోడానికి ఆస్కారం లేదని ఫైనాన్సు కమిషన్ అధ్యక్ష పదవికి నియమించబడిన శ్రీ కె సంతానం మధుర, రామనాడ్ వాణిజ్యమండలి సమావేశంలో మాట్లాడుతూ అన్నారు

తమిళనాడు పరిశ్రమల్లో వెనుకబడినదిగా ఎంచకూడదనీ, తమిళనాడు కంటె వింధ్యప్రదేశ్, మధ్యప్రదేశ్‌లు వెనుకబడిఉన్నాయని అందుచేత ప్లానింగ్ కమిషన్ వివిధ రాష్ట్రాలకు డబ్బు కేటాయించడంలో కొన్ని సూత్రాలను అవలంబించారని అన్నారు

రాష్ట్రాల విభజన విషయంలో మద్రాసు పొరుగు రాష్ట్రాలను వ్యతిరేకం చేసుకోకూడదన్నారు.

రాష్ట్రాల బిల్లుపై మద్రాసు చర్చలు

శాసనసభ బిల్లుకు కాంగ్రెసుపార్టీవారి ఆమోదం

మద్రాసు, మార్చి 26

రాష్ట్రాల పునర్నిర్మాణ బిల్లుకు మద్రాసు శాసనసభ కాంగ్రెసుపార్టీ వారు మొత్తంమీద తమ ఆమోదాన్ని తెలిపారు

శాసనసభలో చర్చకు వచ్చేముందు బిల్లును చర్చించేందుకని కాంగ్రెసు శాసనసభాపార్టీ సమావేశమైంది 161 సభ్యులకు 78 గురు హాజరయ్యారు సమావేశం రెండున్నర గంటలపాటు జరిగింది

బిల్లులో కొద్దిపాటి మార్పులు చేయాలని పార్టీ కోరింది ఈ మార్పులు రాజ్యసభలోనూ, రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్లోనూ మద్రాసుకు వుండవలసిన సంఖ్యను గురించి మాత్రమే

పార్టీ నాయకుడు శ్రీ కామరాజ్ సమావేశంలో మాట్లాడుతూ, కొత్త సమస్యలను లేవనెత్తి అనవసర క్లిష్ట పరిస్థితులు తెచ్చిపెట్టవద్దని, బిల్లును యధాతథంగా ఆమోదించమని సభ్యులను కోరినట్లు తెలుస్తోంది

"దక్షిణ ప్రదేశ్" నిర్మాణాన్ని గురించి ఏ ఒక్క సభ్యుడూ తన ప్రసంగంలో ప్రస్తావనకు తేలేదని తెలుస్తోంది అయితే, ఆర్థిక మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యంమాత్రం భావిపరిస్థితులలో దక్షిణ ప్రదేశ్ నిర్మాణానికి అనుకూలంగా మాట్లాడవలసి వచ్చిందో వివరించినట్లు తెలుస్తోంది

మద్రాసు రాష్ట్రంపేరును "తమిళనాడు" అని మార్చాలని కొంతమంది సభ్యులు కోరారు. అయితే పేరు మార్పు సమస్యను ప్రస్తుతం లేవనెత్తడం మంచిదికాదనీ, దాని విషయమై తగిన సమయం వచ్చినప్పుడు పరిశీలించబడుతుందని ప్రభుత్వం తరఫున చెప్పినట్లు తెలుస్తోంది

ఎన్నికల్లో కాంగ్రెసు ఓడిపోతే....

జాతీయ ప్రయోజనాలు దెబ్బతింటాయని శ్రీ సిన్హా

పాట్నా, మార్చి 25

బీహారు ముఖ్యమంత్రి డాక్టరు శ్రీకృష్ణ సిన్హా ఈవేళ పాట్నా జిల్లా కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల్లో కాంగ్రెసు ఓడిపోతే జాతీయ ప్రయోజనాలు దెబ్బ తింటాయని హెచ్చరించారు

కాంగ్రెసు కార్యకర్తలు పదవుల కోసం ప్రాకులాడకుండా, నిస్వార్థ సేవద్వారా ప్రజల విశ్వాసం చూరగొనాలన్నారు ఎన్నికల్లో కాంగ్రెసు ఓడిపోతే, అభివృద్ధిపనులన్నీ స్తంభించిపోతాయన్నారు జాతీయ పునర్నిర్మాణం ఈనాడు అతి ప్రధానమైన కర్తవ్యం అన్నారు.

బీహారులో గత సంవత్సరం ఆగస్టు నెల మధ్య జరిగిన సంఘటనలను డాక్టర్ సిన్హా ప్రస్తావించారు అప్పుడు కొందరు కాంగ్రెసు వాదులు తన వద్దకు వచ్చి, గాంధీటోపీలు పెట్టుకొన్న వాళ్ళవైపు చూడటానికి కూడ ప్రజలు సిద్ధంగా లేరని తెలియజేసినట్లు చెప్పారు గాంధీ టోపీలు పెట్టుకొన్న వాళ్ళ ద్వారా ఎంత సేవ జరిగిందో ప్రజలు మరచిపోతే, అది దేశానికి చాల దురదృష్టకరమైన విషయమవుతుందని తాను వాళ్ళకు జవాబిచ్చానన్నారు

గ్రామోద్యోగుల రాజీనామాలు

జీతాలు హెచ్చించనందుకు నిరసనగా

అవనిగడ్డ, మార్చి 22

కృష్ణాజిల్లా దివితాలూకా నాగాయిలంక ఫిర్కాలోని మునిసిఫ్, కరణాలు తమ పదవులకు రాజీనామా లందజేశారు

జీతాలు హెచ్చించాల్సిందిగా వీరు ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు పంపుకొన్నా ఆలకించిన నాథుడులేడు అంచేత వారు రాజీనామాలు చేసినట్లు తెలుస్తున్నది

డిప్యూటీ కలెక్టరు వీరందరిని పనుల్లో ప్రవేశించాల్సిందిగా కోరినప్పటికి గ్రామోద్యోగులు అందుకు అంగీకరించలేదు

ఖమ్మం కలక్టరు కక్కుర్తి పనులు

ప్లానింగ్ కమిటీ ఎన్నికల్లో సాంప్రదాయ విరుద్ధచర్యలు

ఖమ్మం, మార్చి 24

ఖమ్మంజిల్లా ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంటు కమిటీకి జరగాల్సిన ఉపాధ్యక్షుని ఎన్నిక సందర్భంలో కలక్టరు శ్రీ భట్ ప్రజాస్వామిక విరుద్ధపద్ధతి, అధికార దుర్వినియోగం ఇత్యాది పనులకు పూనుకొన్నట్లు ఈ క్రింది ఘటనవల్ల బోధపడ్తోంది

ఈ నెల 17 వ తేదీన కలక్టరు అధ్యక్షతన పై కమిటీ సమావేశం జరిగింది ఉపాధ్యక్ష పదవికి పర్చా శ్రీనివాసరావు వకీలుగారి పేరును ఒక సభ్యుడు, మరొక సభ్యుడు శాసన సభ్యుడు శ్రీ కొండబోలు వెంకయ్యగార్ల పేర్లను సూచించారు

"శాసనసభ్యుని ఎన్నికతో రానున్న "ప్రమాదాన్ని" గ్రహించి శ్రీనివాసరావునుబలపర్చాలని అధికార సభ్యులు ఓటింగులో పాల్గొనకూడదనే సాంప్రదాయం ఉన్నా-ఖాతరు చేయకుండా అధికార సభ్యులుకూడా ఓటింగులో పాల్గొనవచ్చని కలక్టరు నోటిమాట హుకుం జారీచేశారు వకీలుగారిని ఎన్నిక చేయించారు

లోగడ రాష్ట్రప్లానింగు కమిటీకి ఖమ్మంజిల్లా నుంచి ప్రతినిధిని ఎన్నుకోవాల్సి వచ్చినప్పుడుకూడా కలక్టరు అధికారసభ్యులు ఓటింగులోపాల్గొనాల్సిందిగా ఆజ్ఞాపించాడు కాని అప్పటి పోలీసు సూపరెండెంటు ఇది ప్రజాస్వామిక విరుద్ధమని తీవ్రంగా ప్రతిఘటించారు అధికార సభ్యులు కూడా ఓటింగ్‌లో పాల్గొనలేదు

"ప్రజాస్వామ్య రక్షణకు" ఈ అత్యధిక సంఖ్యాక ప్రజలచేఎన్నుకోబడిన శాసనసభ్యుని ఓడించేందుకే కలక్టరు అవలంబించిన పద్ధతులు, అధికార సభ్యుల ఓట్లవల్లనే శ్రీనివాసరావుగారు ఎన్నిక కావటం కమిటీ సాంప్రదాయానికి విరుద్ధమని కొందరు కాంగ్రెసువాదులతో సహా రాజకీయవర్గాలవారు భావిస్తున్నారు ముమ్ముందైనా కలక్టరు ఇలాంటి "ప్రజాస్వామ్య" "రక్షణ" పద్ధతులను చేబట్టకూడదని వారు అభిప్రాయపడ్తున్నారు

నిడదవోలు ఐ. ఎల్. టి. డి. కార్మికసభ

నిడదవోలు, మార్చి 24

నిడదవోలు ఐ ఎల్ టి డి కార్మికయూనియన్ సర్వసభ్యసమావేశం ఇటీవల శ్రీ జి యస్ లాలాజీదాస్‌గారి అధ్యక్షతను జరిగింది. సుమారు 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు చీరాల ఐ.ఎల్.టి.డి. కార్మికులు 30 మంది సౌహార్ద్రప్రతినిధులుగా వచ్చారు

సంఘకార్యదర్శి శ్రీ తొంటపాక సుబ్బారావుగారు మాట్లాడుతూ, 1400మంది కార్మికులలో యిప్పటికి 909 మందిసభ్యులుగాచేరారని, 1200 మందివరకు సభ్యులుగాచేరే అవకాశం వుందని తెలియజేశారు

శ్రీ సామన ప్రహ్లాదగారు మాట్లాడుతూ కార్మికుల ఐక్యతను పాడు చేయడానికై మేనేజిమెంటువారు అనేక కుతంత్రాలు పన్నవచ్చునని, వారి కుతంత్రాలను ఛిన్నాభిన్నంచేయాలంటె సంఘంలో ప్రతి కార్మికుడు సభ్యుడుగాచేరి, సంఘాన్ని పటిష్ఠం చేసుకోవాలని ఉద్బోధించారు

యునైటెడ్ ఐ యల్ టి డి వర్కర్సుయూనియన్ సహాయ కార్యదర్శిగా పనిచేస్తూ జబ్బుచేసి మరణించిన శ్రీ వాసంశెట్టి రామన్నగారి అకాలమరణానికి సభవారు సంతాపం వెలిబుచ్చారు

గొల్లపూడి మహాసభ తీర్మానాన్ని పురస్కరించుకొని యునైటెడ్ ఐ యల్ టి డి వర్కర్సుయూనియన్, బ్రాంచీయైన నిడదవోలు ఐ యల్ టి కంపెనీ వర్కర్సు యూనియన్‌ను ఆంధ్ర రాష్ట్ర ఐ యల్ టి డి వర్కర్సు యూనియన్‌తో కలుపుటకు ఏకగ్రీవంగా తీర్మానించారు

కేంద్రప్రభుత్వం ఆంధ్ర - తెలంగాణాలను కలుపుటకు అంగీకరించినందుకుసభవారు హర్షం ప్రకటించారు

తర్వాత శ్రీ సామన ప్రహ్లాదగారు అధ్యక్షులుగా, శ్రీతొంటపాకసుబ్బారావుగారు కార్యదర్శిగా నూతనకార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు

ఐ ఎల్ టి. డి కార్మికుల కోర్కెల దినోత్సవాలు

రాష్ట్ర ఐ ఎల్ టి డి కంపెనీ వర్కర్సు యూనియన్ ఇచ్చిన పిలుపు నందుకొని గుంటూరుజిల్లా పర్చూరు, మద్దిపాడు బ్రాంచీలలోని కార్మికులు కోర్కెల దినోత్సవం జరిపారు.

రేడియో

మార్చి 29 గురు॥

విజయవాడ (357.1
మీటర్లలో) ఉదయం
6-50 స్వాగతము,
6-55 ప్రసారవిశేషాలు,
7-0 (తె వా.),
7-15 ఉదయగానం,
7-30 మద్రాసువలె,
8-0 (ఆం వా),
1-0 మద్రాసువలె,
1-30 గీతావళి,
1-40 హిందీలో వార్తలు
1-50 (తె వా),
2-0 మద్రాసువలె,
2-15హిందీ కార్యక్ర॥
4-0 కృతులు,
5-30 గోటువాద్యం;
6-0 సంగీతశిక్షణ,
6-15 (ప్రాం. వా.),
6-25 స్థానికప్రకటనలు,
6-30 గ్రామస్థులకు,
7-0 (తె వా.),
7-15 గీతావళి పి దశరథరామయ్య,
7-30 పుణ్యక్షేత్రాలు ప్రసంగం,
7-45 శిలారథం రూపకము,
8-0 ఆంధ్రదేశపు జానపదగేయాలు,
8-15 రాగం, తానం, పల్లవి,
9-0 (ఆం వా),
9-15 గీతావళి పి దశరథరామయ్య,
9-30 గానసుధ,
10-0 సమాప్తి

మద్రాసు బి. (211.3
మీటర్లలో) ఉదయం
6-50 స్వాగతము,
7-0 (తె వా);
7-15 ఉదయగానం,
7-30 కృతులు,
8-0 (ఆం వా),
12-0 కార్మికులకు;
12-30 వీణ,
1-0 గీతమాలిక,
1-30 (ఆం వా),
1-40 గీతమంజరి,
1-50 (తె. వా),
2-0 వేణువు,
2-15 కావ్యపఠనం,
4-0 సంకీర్తనం,
5-30 నాదస్వరం,
6-0 (ఆం వా),
6-15 (ప్రాం వా);
6-25 లలితగీతము,
6-30 గ్రామస్థులకు,
7-0 (తె వా),
7-15 గీతావళి పి. దశరథరామయ్య,
7-30 పుణ్యక్షేత్రాలు ప్రసంగం,
7-45 సంధ్యాగానం పి లీల,
8-0 ఆంధ్రదేశపు జానపదగీతాలు,
8-15 రాగం, తానం, పల్లవి,
9-0 (ఆం వా),
9-15 ప్రసంగం,
9-30 కేళరాగకీర్తనలు,
9-45 సమీక్ష(తమిళం),
10-0 కోరినపాటలు,
10-30 సమాప్తి.

హైద్రాబాద్ (411 0
మీటర్లలో) ఉదయం .
6-50 సుప్రభాత్,
6-55 కార్యక్రమవివరణ
7-0 (తె వా),
7-15 ఉదయగానం,
7-45 (క. వా),
8-0 (ఆం వా),
8-15 (హిం వా),
8-30 ఖయాల్,
12-30 వాద్యబృంద,
12-50 (ఉ వా),
1-0 స్త్రీసంసార్,
1-45 వేణువు,
1-50 (తె వా),
5-30 ఖయాల్,
6-0 ఘజల్,
6-15 ఇస్లాత్,
6-30 గానమంజరి,
6-40 స్థానికప్రకటనలు,
6-45 గ్రామసీమ (పిల్లలకు),
7-0 (తె. వా);
7-15 గ్రామసీమ (స్త్రీలకు),
7-45 గీత్, భజన్,
8-0 వార్తాసమీక్ష (హిందీ),
8-15 తబ్లా;
8-30 ప్రసారగీత్,
9-0 (ఆం వా),
9-15 (ఉ వా),
9-30 టి టి సీత,
10-30 సమాప్తి

కందుకూరు పంచాయితీ ఎన్నికలు

అభ్యర్థులపై దౌర్జన్యాలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి

కందుకూరు, మార్చి 25

నెల్లూరుజిల్లా కమ్యూనిస్టు కమిటీ సెక్రటేరియట్ సభ్యులు శ్రీ షేక్ కాలేషాగారు ఇలా వ్రాస్తున్నారు

కందుకూరు టౌన్ పంచాయితీకి ఈ నెల 22 వ తేదీన నామినేషన్లు జరిగాయి ఈ పంచాయితీబోర్డును గుత్తగా తీసుకొని తమ స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకొంటున్న దివి బ్రదర్సు తమకు పోటీవేసిన అభ్యర్థులపై దౌర్జన్య చర్యలకు దిగారు నీచమైన ఎత్తుగడలతో తమ పోటీదార్ల నామినేషన్లు రద్దుచేయించుటకు కుట్రపన్నారు.

ఈ ఎత్తుగడల్లో ఆరితేరిన "దివి వెంకట సుబ్బయ్యగారు తమ కుట్రలు బైటబడ్డా సమర్థించుకొనేందుకు శాసనసభ్యులు శ్రీ దివి కొండయ్యగార్ని కూడా [illegible]కొన్నారు వకీలు వృత్తిలోవున్న తమ్ముడు పిచ్చయ్యగార్ని వినియోగించారు 23-3-56 న స్క్రూటినీ జరుగుతుండగా 2 వ వార్డులో తమ గ్రూపుకు పోటీవేసిన శ్రీ పి నరసింగరావుగారి సపోర్టర్ను, కొండన్ను, పట్టుకొని బలవంత పెట్టారు "తమకేమీ చెప్పకుండానే తమ చేత ఏదోకాగితంమీద సంతకం చేయించారని, అది నామినేషన్ పత్రమని తమకు తెలియదని వారితో స్టేటుమెంట్లు డి పై పి ముందు ఇప్పించినామినేషన్ రద్దుచేయించారు

ఈ పాచిక పారిన వెంటనే తిరిగి 11 వ వార్డులో పోటీచేస్తున్న మహమ్మద్ రంతుల్లాగారి ప్రపోజరును సెకండరును పట్టుకు రావాలని ప్రయత్నించి సెకండర్ను మాత్రం పట్టుకొని గం 3 లకు తమ ఇంట్లో బిగించి బలవంతంచేసి ఒప్పించి ఆఫీసరు ఎదుటికి తీసుకొచ్చారు

10 వ వార్డులో పోటీచేస్తున్న కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ జాఫర్‌బాషా ఈ అన్యాయాన్ని గూర్చి ఆఫీసరు దృష్టికి తెచ్చారు

అప్పుడు ఆఫీసరు అచ్చటనుండి మునసబుగార్ని, జహంగీరు సాహెబును క్రిందికి పంపివేశారు. రంతుల్లా నామినేషన్ అంగీకరించారు.

దీనిపై ఉగ్రుడైన మునసబుగారు జాఫర్‌బాషాను తిట్టుతూ అతని చెయ్యిపట్టి పోతున్న జహంగీర్ను బలవంతంగా లాగి తమ ఆఫీసులో బిగించమని తమ పరివారానికి ఆజ్ఞాపించారు

ఈ ప్రజాస్వామ్య వ్యతిరేకమైన, నీచపు కార్యాన్ని అక్కడే వున్న శాసనసభ్యులు శ్రీ దివి కొండయ్యగారి దృష్టికి తెస్తూ "ఇదేనటండీ మీ ప్రజాస్వామ్యం" అని అడిగినందుకు నన్ను "స్టుపిడ్" అంటూ చేయచాచి చెంపకొట్టు పెట్టబోగా జాఫర్‌బాషా "వార్ని కాదు నన్ను కొట్టండి"అంటూ ముందుకొచ్చారు ఇంతలో పక్కన ఇద్దరన్నదమ్ములు, పరివారంతో సహా మా ఛుట్టూ మూగారు చుట్టుపట్ల జనం వందలపైగా చేరడంతో చల్లగా తప్పుకొన్నారు

టౌన్‌లో ఈఘటన తర్వాత సామాన్యప్రజలు, విద్యావంతులు అందరూ ఈ అవినీతికర సంకుచిత రాజకీయాలకు పాల్పడిన పెద్దలను మునసబుగార్ని అసహ్యించుకొంటున్నారు

పై అధికార్లు వెంటనే కలుగజేసుకొని యీ ఎన్నికలలో పోటీచేస్తున్న అభ్యర్థులకు జరుగుతోన్న అన్యాయాలను అరికట్టాలని కోరుతూన్నాను

విశాఖ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు

ప్రభుత్వం స్వాధీనపరచుకోవాలని విజ్ఞప్తి

విజయనగరం మార్చి 24

విశాఖజిల్లాలోని ప్రాథమిక పాఠశాలలను ఆంధ్ర ప్రభుత్వం వెంటనే స్వాధీన పరచుకోవాలని కోరుతూ ఇటీవల ఇక్కడ జరిగిన విజయనగరం, భీమిలి తాలూకాల ప్రాథమికోపాధ్యాయుల సభలో తీర్మానించారు

ఈ సమావేశం శ్రీ ఖలీఖా ఖిలాఫ్ పాఠశాలలో జరిగింది ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్యగారు సభలో ఉపన్యసించారు

* * *

హోలీ పండుగ సందర్భంలో రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ భారత ప్రజలకు తన శుభాకాంక్షలను తెలియజేశారు

గుంటూరు అడిషనల్
సబుకోర్టులో O S 1/56
వాది పాములపాటి వెంకటకృష్ణయ్య
చౌదరి మరియు
ప్రతివాదులు
1 బండారు వెంకటనారాయణ.
2 కిల్లినేని రామారావు
3 తనుమూరి వెంకటరాజు
వాది తరఫున నోటీసు

యీ కేసులో 2 వ ప్రతివాదికి దావా నోటీసు నిమిత్తం ది 2-4-1956 తేదీకి వాయిదా వేసినారు గనుక మీరు గల ఆక్షేపణలు సదరు తేదీ పగలు 10 గంటలకు పై కోర్టువారి యెదుట హాజరయి తెలియ జేసుకోవలెను లేనియెడల మీ పరోక్షముందు విచారించి తీర్మానించబడునని తెలుసుకోవేది.

గాడె వీరాంజనేయశర్మ
వాది తరఫున అడ్వకేట్, 26-3-56.

అతి శోచనీయంగా వున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

సప్లిమెంటరీ పద్దులపై చర్చలకు ముఖ్యమంత్రి గోపాలరెడ్డిగారి సమాధానం

(విశాలాంధ్ర విలేఖరి)

కర్నూలు, మార్చి 26

"గత రెండు సంవత్సరాల్లో మనకు రు. 11 కోట్లు లోటు ఏర్పడింది రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇప్పటికి 40 కోట్లు అప్పుచేశాం. మొత్తం రుణం ఈనాటికి 70 కోట్లు వరకు ఉంది రిజర్వుబ్యాంకునుండి అదేపనిగా డబ్బుతీసుకుంటే ఇక మీ బిల్లులను ఆమోదించడం సంభవం కాక పోవచ్చునని కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ దేశముఖ్ ఇటీవల హెచ్చరించారు. ఇదీ మన రాష్ట్ర ప్రస్తుత ఆర్థికస్థితి" అని ముఖ్యమంత్రి శ్రీ గోపాలరెడ్డిగారు నేడు సప్లిమెంటరీ డిమాండ్లపై జరిగిన చర్చకు సమాధానం యిస్తూ అన్నారు.

రెండురోజులుగా జరిగిన ఈ చర్చ నేడు ముగిసింది శ్రీ గోపాలరెడ్డిగారు తమ ప్రసంగంలో యిలా అన్నారు

"రాష్ట్రంలోని నీటి వనరులన్నింటినీ పూర్తిగా అభివృద్ధి చేయడానికి మొత్తం రు 850 కోట్ల రూపాయలు కావాలి సభ్యులు రోడ్లు, ఆస్పత్రులు, మంచినీటి వసతులు, మొదలైనవి అసంతృప్తికరంగా వున్నాయని తెలిపారు ఇవన్నీ ఆంధ్రరాష్ట్రం ఏర్పడేసరికి వారసత్వంగా లభించాయి వీటన్నిటిని బాగుచేసేందుకు ప్రభుత్వానికి డబ్బు కావాలి అందుచేత రాష్ట్ర ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయాలి అన్నిటికన్నా ముఖ్యంగా ద్వితీయ ప్రణాళికను అమలుజరపాలి కనుక పన్నులు విధించడం తప్పితే మరొక మార్గం ఏదీ కనిపించడంలేదు

కేటాయించిన ధనంకంటె విద్యుత్ శాఖ ఎక్కువగా ఖర్చుపెడుతూంది పనులు చురుకుగా జరిగించుతున్నందుకు సంతోషమే కాని డబ్బులేదు అదే అసలుసమస్య ప్రభుత్వం నడక తాబేలు నడకగా ఉందని అంటున్నారు. కుందేలు చురుకుగా ఉండాలంటే కూడా అదే ప్రధానసమస్య

రోడ్లకోసం చేసిన ఖర్చునుండి ఆదాయమేమీ రాదు కనుక వాటికి ప్రాధాన్యత యివ్వలేదు లోగడ జమీందారీ ప్రాంతాలలోని అడవులను వినియోగపరచడానికి చూస్తున్నాం కనిగిరిలో త్వరలోనే ఇందుకు సంబంధించిన అందరి సమావేశం ఏర్పాటుచేస్తాం

కొన్ని జిల్లాల న్యాయ కార్యనిర్వాహణ శాఖలను విడదీయలేదని అన్నారు డబ్బు కొరత వలననే కార్యక్రమాన్ని అమలు చేయలేక పోతున్నాం

బుడమేటి రిజర్వాయరు

బుడమేరు రిజర్వాయరు నిర్మాణాన్ని విరమించినందుకు సభ్యులు విమర్శించారు ఇంజనీర్లతో సంప్రదించి స్కీమును మరల పరిశీలిస్తున్నాము

నా బంధువులు ఎవరో నా పేరుపయోగించుకొని అధికారులను లొంగదీస్తున్నారని సుందరయ్యగారు ఆక్షేపించారు ఇట్టి ఆరోపణచేసే మనస్తత్వం మంచిదికాదు సుందరయ్యగారు ఇక్కడ లేరుగనుక నేను ఇంక ఆ విషయంగురించి చర్చించను శ్రీ రత్నసభాపతికూడా నా తమ్ముని ప్రవర్తనగురించి చెప్పారు శ్రీ రత్నసభాపతిగారికి ఈ సమాచారం ఎక్కడనుంచి అందింది?

శ్రీ రత్నసభాపతి మీ వారినుండే వచ్చింది

శ్రీ గోపాలరెడ్డిగారు తమ ప్రసంగం కొనసాగిస్తూ, ఉద్యోగుల ప్రవర్తన గురించి రహస్యశాఖ ఉండవలసిందేనని అన్నారు అయితే వారిగురించి ఏమివ్రాశారో వారికి తెలియచేస్తారు కాని అన్ని సందర్భాల్లోను జరగకపోవచ్చునన్నారు

పద్దులపై చర్చ

పద్దులపై జరిగిన చర్చలో కమ్యూనిస్టుసభ్యుడు శ్రీ ఎల్లమందారెడ్డి మాట్లాడుతూ, అడవులగురించి లోగడ ప్రభుత్వం ఒక సమావేశం ఏర్పాటు చేసిందనీ, ఆ సమావేశ నిర్ణయాలను ఇంతవరకు ప్రభుత్వం అమలుజరపలేదనీ అన్నారు ఇంకా యిలా అన్నారు

అటవీ ప్రాంతాలలోని రెవిన్యూ ఉద్యోగులు కంచపుల్లరి వసూలుచేస్తున్నారు ఫారెస్టు ఉద్యోగులుకూడా పుల్లరి వసూలుచేస్తున్నారు ఈ విధంగా రెండుశాఖలు ఒకేదానిపై రెండుసార్లు పన్నులు వసూలుచేయడం చట్టవిరుద్ధం దీనిని ఆపుచేయాలని ప్రభుత్వానికి విన్నవించారు కాని ఇంతవరకు ఎట్టిచర్య తీసుకోలేదు ముఖ్యంగా ఈ అక్రమాలు ప్రభుత్వం వశపరచుకున్న జమీందారీప్రాంతాలలోనే జరుగుతున్నాయి ఇక్కడ అధికారులుపెట్టిన అక్రమ కేసులు కూడా ఎత్తివేయలేదు

నెల్లూరు జిల్లాలోని ఎయిడెడ్ స్కూళ్ళను ప్రభుత్వం వశంచేసుకోవడంలో సమర్థవంతంగా ఉన్న మేనేజిమెంటు స్కూళ్ళనే పేరుతో కొన్నింటిని వశపరచుకోకుండా మినహాయిస్తున్నారు ఇట్టి మినహాయింపులేమీ చేయకూడదు ఈ సందర్భంలో నెల్లూరు జిల్లాలోని 400 మంది ఎయిడెడ్ స్కూళ్ళ ఉపాధ్యాయులకు తొలగింపు నోటీసులు యిచ్చారు వీరందరినీ తొలగించకుండా చూడాలని కోరుతున్నాను

పెరిగిపోతున్న ధాన్యం ధరలు

శ్రీ కంజి నాగేశ్వరరావు (కమ్యూ) గారు మాట్లాడుతూ, ధాన్యం ధరలు రు 21 నుండి రు 24 వరకు పెరిగిపోయాయనీ, పేదలకు సంబంధించినంతవరకు అప్పుడే కరువు ప్రారంభమైందనీ అన్నారు ఇంకా ఇలా అన్నారు

పల్లెటూళ్ళలో భూస్వాములు బ్యాంకులలో ధాన్యం పెట్టి రుణాలు తీసుకొని ధరకోసం నిలవచేశారు. అందుచేత ప్రభుత్వం ఈ నిల్వధాన్యాన్ని స్వాధీనం చేసుకోవాలి, వెంటనే చౌకడిపోలు తెరచి బియ్యం సరఫరా చేయాలి

చాలకాలంగా కాటిపాక లాకును రీమోడల్ చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు ప్రభుత్వం అందుకు సత్వరచర్య తీసుకోవాలి రాజోలుతాలూకా ఆస్పత్రిలో లేడీ డాక్టరును వేయాలి అంతర్వేదిపాలెం తదితరచోట్లవున్న లోకల్ ఫండ్ ఆస్పత్రులను ప్రభుత్వం స్వాధీన పరచుకోవాలి

బంజరుభూములను సొసైటీల కివ్వడానికి రు 500/- లు కనీసం డిపాజిట్టు చేయాలని, అటుపైన అధికారులు విచక్షణతో ఆ మొత్తాన్ని పెంచవచ్చునని అవకాశం వుంది దీనితో అధికారులు తమ యిష్టం వచ్చిన రీతిగా ఈ డిపాజిట్టు మొత్తాలను పెంచుతున్నారు దీనిని అరికట్టాలి.

శ్రీ వి పార్థసారధి (కాం), ఆంధ్రలో అటవీ, ఖనిజసంపద విస్తారంగా వుందన్నారు. అడవులు నాశనం కాకుండా ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకోవాలని, ఖనిజసంపద వుపయోగానికి కూడా పూనుకోవాలని అన్నారు

శ్రీ యం సత్యనారాయణరాజు (సోషలిస్టు), గత వర్షాకాలంలో గండ్లుపడ్డ చెరువులను ఇంకా మరమ్మతు చేయలేదని, అందుకు సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు

శ్రీ వల్లూరి రామాచార్యులుగారు మాట్లాడుతూ, మద్యనిషేధం అమలు పోలీసు శాఖకు బదలాయించబడినందున, మద్యనిషేధ శాఖనుకూడా శ్రీ సంజీవరెడ్డిగారికి అప్పగించాలన్నారు

శ్రీ కానాని వెంకటరత్నం (కాం), కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలలో వరదలు నివారించడానికి బుడమేరు రిజర్వాయరు పథకం అత్యవసరమన్నారు

ఇంకా పలువురు సభ్యులు చర్చలలో పాల్గొన్నారు ఆ తర్వాత 18 కోట్ల 4 లక్షల రూపాయలకు సప్లిమెంటరీ పద్దులు ఆమోదించబడ్డాయి

ప్లానింగ్ కమిషన్ సూచించిన భూసంస్కరణలు

స్వల్పమార్పులతో అమలుపర్చగలమని శాసనసభలో కళా వెంకట్రావుగారి హామీ

కర్నూలు, మార్చి 26

స్థానిక పరిస్థితులకు తగినట్లు కొన్ని స్వల్పమార్పులు చేసి, ప్లానింగ్ కమిషన్‌వారి భూసంస్కరణలను అమలు పర్చాలని ఆంధ్రప్రభుత్వం నిశ్చయించిందని ప్రణాళికా మంత్రి శ్రీ కళా వెంకట్రావుగారు నేడు శాసనసభలో తెలియజేశారు.

హైదరాబాద్‌లో ఈ తరహాకొన్ని అభ్యుదయకరమైన భూసంస్కరణలు అమలు జరుగుతున్నవని, ఆంధ్ర - తెలంగాణా రాష్ట్రం కూడా వాటిని స్వీకరించవచ్చునని అన్నారు

ద్వితీయ పంచవర్ష ప్రణాళికపై మూడురోజులుగా జరిగిన చర్చకు సమాధానం చెబుతూ, వెంకట్రావుగారు పైవిధంగా అన్నారు చైనా మార్గాలను అనుసరించాలనే సూచనలను ఆయన నిరాకరించారు చైనా అనుభవాన్ని మక్కీకిమక్కీ అనుసరించడంవల్ల ఇండియాలో నష్టం వస్తుందని ఒక సోవియట్ ఆర్థికవేత్త చెప్పినట్లు పేర్కొన్నారు

సమాజంలో అసమానత్వాన్ని తొలగించడమే ప్రణాళిక లక్ష్యమని వెంకట్రావుగారన్నారు ముందే అభిప్రాయాలను ఏర్పరచుకోకుండా ప్రణాళికను పరిశీలించ వలసిందిగా కోరారు

అంతకుముందు చర్చ జరిగినపుడు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు మాట్లాడుతూ, ప్రణాళికకు సరియైన ప్రచారం లేదన్నారు శాసనసభ్యులంతా ఒకరితో నొకరు పోటీపడి, ప్రణాళిక ఉపయోగాలను గురించి ప్రజలకు నచ్చచెప్పాలన్నారు

శ్రీ వి వెంకటసుబ్బయ్య (కాం) గారు మాట్లాడుతూ, జాతీయ ప్రణాళిక సూత్రాలకు తగినట్లు రాష్ట్ర ప్రణాళిక లేదన్నారు జాతీయ ప్రణాళికలో పరిశ్రమలకు నూటికి 18 వంతులు కేటాయించగా, రాష్ట్ర ప్రణాళికలో పరిశ్రమలకు నూటికి 9 వంతులే కేటాయించారన్నారు

శ్రీ యం రాజేశ్వరరావు (కాం) మాట్లాడుతూ, జనాభాను కంట్రోలు చేయడానికి శాసనంచేయాలన్నారు లేకపోతే, జనాభా పెరుగుదలవల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు దెబ్బ తగులుతుందన్నారు

శ్రీ ప్రగడ కోటయ్య (కాం), మిల్లుబట్టల పరిశ్రమ, చేనేత పరిశ్రమ ఒకదానికొకటి చేదోడు వాదోడుగా వుండాలే కాని, పోటీపడరాదన్నారు

శ్రీ చల్లా సుబ్బారాయుడు (కాం), మిల్లుబియ్యంపై పన్ను విధించడం ద్వారా దంపుడుబియ్యాన్ని ప్రోత్సహించాలన్నారు అలాగే అంబర్ చర్ఖాకుకూడా రక్షణ ఇవ్వాలన్నారు

శ్రీ బి రత్నసభాపతి (సోషలిస్టు) మాట్లాడుతూ, భూసంస్కరణల ద్వారా, పన్నులవ్యవస్థ సంస్కరణ ద్వారా, సమాజంలో అసమానత్వాన్ని తొలగిస్తేతప్ప ఏ పథకమూ విజయవంతం కాజాలదన్నారు

శ్రీ కల్లూరి సుబ్బారావుగారు మాట్లాడుతూ కలెక్టర్లు నిర్మాణ క్రమం ఏమీచేయలేక పోతున్నారని అన్నారు.

శ్రీ జి వాసయ్య ఈ ప్రణాళిక దశలవారిగా సోషలిజం స్థాపించుతున్నట్లు కనిపిస్తోందనీ ఇది అసాధ్యమయ్యే ధ్యేయమన్నారు

ఇండొనేషియా పార్లమెంటుకు ప్రారంభోత్సవం

జకార్తా, మార్చి 26

ఇండొనేషియాలో ప్రప్రథమంగా ఎన్నికైన పార్లమెంటును నేడు అధ్యక్షుడు సోకర్నో ప్రారంభించారు ఒకప్పుడు డచ్ ఆఫీసర్ల క్లబ్బుగావున్న భవనంలో కొత్త పార్లమెంటుకు సోకర్నో ప్రారంభోత్సవం జరిపారు

అధ్యక్షుడు సోకర్నో, ఉపాధ్యక్షుడు హట్టా సైనిక విన్యాసాలను తిలకించి, ఆతర్వాత పార్లమెంటుభవనంలోకి ప్రవేశించి వేదికపై ఆసీనులైనారు మునుపటికన్నా కష్టపడి పనిచేయాలని ఉద్బోధిస్తూ సోకర్నో ప్రసంగించారు

దలైలామాకు భారత ప్రభుత్వ ఆహ్వానం

బుద్ధజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు

న్యూఢిల్లీ, మార్చి 26

దలైలామానూ, పంచన్‌లామానూ చైనాలోని తదితర ప్రముఖ బౌద్ధమత గురువులను భారత దేశంలో జరిగే బుద్ధజయంతి ఉత్సవాల్లో పాల్గొనవలసిందిగా కోరుతూ భారత ప్రభుత్వం చైనా ప్రభుత్వంద్వారా అధికారయుతంగా ఆహ్వానాలను పంపించింది

వంశధార ప్రాజెక్టుపై ఒక నెలలోగా నిర్ణయం

కర్నూలు పత్రికా గోష్ఠిలో ఒరిస్సా ముఖ్యమంత్రి శ్రీ నవకృష్ణ చౌదరి ప్రకటన

కర్నూలు, మార్చి 26

వంశధార ప్రాజెక్టుపై నిర్ణయం ఒక నెలలో తీసుకోబడుతుందని ఒరిస్సా ముఖ్యమంత్రి శ్రీ నవకృష్ణ చౌదరి నేడిక్కడ పత్రికాగోష్ఠిలో అన్నారు ఉభయరాష్ట్రాల చీఫ్ ఇంజనీర్లు ముందు ప్రాజెక్టు సాంకేతిక అంశాలను చర్చిస్తారని, ఆ తర్వాత మంత్రుల స్థాయిలో చర్చలు జరుగుతాయని అన్నారు

ఆంధ్ర - ఒరిస్సా చీఫ్ ఇంజనీర్లు మార్చి 29 న ఢిల్లీలో సమావేశమై, ప్రాజెక్టు గురించి చర్చిస్తారన్నారు

గొట్ట, సింకిడీలవద్ద కాకుండా దానికిపైన సన్నసాయి అనేచోట డామ్ నిర్మించవలసిందిగా ఆంధ్ర ప్రభుత్వానికి ఒరిస్సా ప్రభుత్వం సూచించిందన్నారు గొట్టవద్ద ఎత్తున డాము నిర్మించితే, పర్లాకిమిడికి ప్రమాదం కలుగుతుంది సింకిడీ వద్ద డాము నిర్మించితే, 18 వేల ఎకరాలు మాత్రమే సాగులోకి వస్తాయి కోటీ 90 లక్షలు ఖర్చవుతుంది గొట్ట డాముకు 10 కోట్ల 66 లక్షలు ఖర్చవుతుంది 2 లక్షల ఎకరాలు సాగవుతాయి

ఒరిస్సా ప్రభుత్వం సూచించిన స్థలం వంశధార ఉపనదులు నాలుగైదుకలిసే చోట వుంది అది ఒరిస్సా ప్రాంతంలో వుంది అక్కడ డామ్ నిర్మిస్తే, గొట్టడామ్ క్రింద సాగయ్యే ప్రాంతం సాగవ్వడమే కాకుండా, ఒరిస్సాలోకూడా కొంతసాగవుతుంది.

సన్నసాయి ప్రాజెక్టును ఆంధ్ర-ఒరిస్సా ప్రభుత్వాలు కలిసి నిర్మిస్తాయని శ్రీ నవకృష్ణచౌదరి చెప్పారు ఉభయ ప్రభుత్వాలు ఒక నెలలోగా ప్రాజెక్టుపై ఒడంబడికకు వస్తాయని ఆశాభావం వెలిబుచ్చారు

సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుకు బదులు బాలిమేల ప్రాజెక్టును తాము ఆంధ్ర ప్రభుత్వానికి సూచించినట్లు శ్రీ చౌదరి వెల్లడించారు సీలేరు పథకం ఒట్టి విద్యుచ్ఛక్తి పథకమే కాగా, బాలిమేల పథకం ఇరిగేషన్-విద్యుచ్ఛక్తి పథకంగావుంటుందన్నారు ఒరిస్సాలో చాలప్రాంతం దానివల్ల సాగులోకి వస్తుందన్నారు బాలిమేలవద్ద ఎత్తుకూడా జాస్తిగా వుందని, అందుచేత, ఎక్కువ విద్యుత్తు కూడా ఉత్పత్తవుతుందని అన్నారు

సీలేరు ఒరిస్సాలో వున్నప్పటికీ, దానిపై విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేసే హక్కు పూర్తిగా ఆంధ్రప్రభుత్వానికిస్తూ ఉభయ ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నాయి

సీలేరు ప్రాజెక్టుకు 40 కోట్లు ఖర్చవుతుందని అంచనా దానివల్ల ఒకటిన్నర లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది

ఉత్తరఫ్రాన్సులో కార్మికుల సమ్మె

లిల్లీ, (ఫ్రాన్స్) మార్చి 26

ఆల్జీరియన్ జాతీయవాదుల పిలుపు ననుసరించి ఉత్తరఫ్రాన్సు ఫ్యాక్టరీలలో పనిచేసే ఉత్తరాఫ్రికా కార్మికులంతా నేడు సమ్మెచేశారు సమ్మెదారులపట్ల సానుభూతిగా చాల హోటళ్ళుకూడా మూతపడ్డాయి

రాష్ట్రపతిపాలన "సలహాసంఘ"మంటూ వుండదని శ్రీ రావు వెల్లడి

త్రివేంద్రం, మార్చి 26

తిరువాన్కూర్ - కొచ్చిన్ రాజప్రముఖుడికి సలహాదారుడుగా నియమించబడిన శ్రీ పి యస్ రావు నేడిక్కడ పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో "సలహా సంఘ" మంటూ ఏమీ వుండదన్నారు ఆ లాంటి సలహా సంఘాన్ని ఏర్పాటు చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆయనన్నారు

రాష్ట్రపతి పరిపాలనాకాలంలో రాష్ట్రానికి సంబంధించిన శాసనాలేవైనా చేయాలంటే ఆ రాష్ట్రాల నుండి ఎన్నుకోబడిన పార్లమెంటు సభ్యులతో దేశ వ్యవహారాల మంత్రి, తాను, సమావేశమై చర్చించుకుంటామన్నారు ఇతర ప్రజానాయకులతో కూడా తాను అప్పుడప్పుడు కలుసుకుని సలహా తీసుకోగలనన్నారు

తిరువాన్కూర్ - కొచ్చిన్‌లో విద్యాధికులలో నిరుద్యోగం విపరీతంగా వున్నదనీ, దానిని తగ్గించేందుకు ప్రభుత్వం తీవ్రంగా యత్నిస్తుందనీ శ్రీ రావు చెప్పారు ద్వితీయ పంచవర్ష ప్రణాళిక ఇందుకు అనేకఅవకాశాలను కల్పిస్తుందన్నారు

రాష్ట్రపతిపాలనా కాలంలో ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడంలో తనకు పత్రికలు తోడ్పడాలని శ్రీ రావు విజ్ఞప్తి చేశారు

* * *

భారతదేశంలోను, ఆసియాలోను మొదటి రైల్వే నడిచిన ఏప్రిల్ నెలలో రైల్వే వారోత్సవం జరుగుతుంది ఆ వారంలో రైళ్ళను సకాలానికి నడపడానికి ప్రయత్నిస్తారట

ఎయిడెడ్ స్కూళ్లకిస్తున్న గ్రాంట్ల వినియోగం

సరిగా జరగడంలేదని శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడి

(విశాలాంధ్ర విలేఖరి)

కర్నూలు, మార్చి 26

ఎయిడెడ్ స్కూళ్ళ మేనేజర్లు తమకు ప్రభుత్వం ఇస్తున్న గ్రాంట్లను సరిగా వినియోగించడంలేదని, ఆంధ్ర రాష్ట్ర వుపాధ్యాయ ఫెడరేషన్, దేవమందిరం అనే టీచరు పంపిన ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయా అని నేడు శాసనసభలో శ్రీ తెల్లంకి విశ్వేశ్వరరావుగారు ప్రశ్నించగా, అలాంటి ఫిర్యాదులు వచ్చాయని, అవి విచారణలో వున్నాయని ముఖ్యమంత్రి గోపాలరెడ్డిగారు జవాబు చెప్పారు

శ్రీ పిల్లలమర్రి, ఎల్లమందారెడ్డిగార్ల అనుబంధ ప్రశ్నలకు ముఖ్యమంత్రి జవాబుచెబుతూ, ఇటీవలనే విద్యాశాఖ డైరెక్టర్‌ను ఈ విషయమై కలుసుకున్నామని, ఈ సమస్యను త్వరలో పరిష్కారం చేస్తారని అన్నారు

మరొక ప్రశ్నకు సమాధానం చెబుతూ, దేవమందిరం గారికి ఉద్యోగం ఇప్పించడానికి ప్రయత్నం చేస్తామన్నారు ఆయన నూజివీడులో పనిచేసేవాడని చెప్పారు

కనిగిరి రిజర్వాయరు

కనిగిరి రిజర్వాయర్ సప్లయి ఛానెల్ రీమోడల్ చేయాలని నెల్లూరు జిల్లా ప్లానింగ్ బోర్డు సిఫార్సు చేసిందిగదా అని శ్రీ బసవారెడ్డి శంకరయ్యగారు ప్రశ్నించగా, సంజీవరెడ్డిగారు సమాధానం చెబుతూ, ఆ సిఫార్సు తమకు అందిందని, దానిపై ఇంజనీర్లవద్దనుండి ఎస్టిమేట్లు కోరామని, ఆరునెల్లలో అవి వస్తాయని అన్నారు

మరొక ప్రశ్నకు సంజీవయ్యగారు సమాధానం చెబుతూ, వుల్లిపాయలపైన, బంగాళాదుంపలపైన అమ్మకపు పన్నువున్నదేగాని, ఆకుకూరలపై లేదన్నారు వుల్లిపాయలపైన బంగాళా దుంపలపైనకూడా పన్ను తీసేయించే విషయం ఆలోచనలో వుందన్నారు

ఈ పన్ను టోకువర్తకులనుంచి వసూలుచేయడంలేదు చిల్లరవర్తకుల నుంచి మాత్రమే వసూలుచేస్తున్నారు దీనిపై హైకోర్టులో రిట్ దాఖలై వుందిగదా అని ప్రశ్నించగా, ఆ విషయం తనకు గుర్తుచేసినందుకు ధన్యవాదాలన్నారు 10 వేల రూపాయలకు తక్కువ వర్తకం చేసేవారిపై పన్ను వేయడంలేదన్నారు

బావులకోసం ఇచ్చిన సబ్సిడీని సకాలంలో ఉపయోగించలేదని ఆ మొత్తాలను మళ్ళీ వసూలుచేస్తున్నారు వాటిని రద్దుచేయించడమో, చెల్లింపుకు కాలపరిమితి పెంచడమో చేయాలని ఒక సభ్యుడు కోరగా అది సాధ్యం కాదని మంత్రి ఓబులరెడ్డిగారు సమాధానమిచ్చారు ఇదే ఆయన జవాబిచ్చిన మొదటిప్రశ్న.

కొందరు రైతులు సకాలంలో పని పూర్తిచేసినా, తాసీల్దార్ల రిపోర్టులవల్ల వారికి అన్యాయం జరుగుతూంది అట్టి సంఘటనలను పునర్విచారణ జరుపుతారా అని శ్రీ కాశిరెడ్డిగారు ప్రశ్నించగా, స్పష్టంగా సంఘటనలు చెప్పితే, విచారిస్తామన్నారు

మరొక ప్రశ్నకు జవాబు చెబుతూ ప్రభుత్వం కండ్లలో దుమ్ముకొట్టిన రైతులే హెచ్చుమంది వున్నారని ఓబులరెడ్డిగారు ఆరోపించారు

ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ సమావేశం

విజయవాడలో ఏప్రిల్ 13, 14, 15 తేదీల్లో

విజయవాడ, మార్చి 26

ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావుగారు యిలా ప్రకటిస్తున్నారు

ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టుకమిటీ సమావేశం ఏప్రిల్ నెల 13, 14, 15 తేదీల్లో విజయవాడలోని రాష్ట్ర కమిటి కార్యాలయంలో జరుగుతుంది రాష్ట్రకమిటీ సభ్యులంతా తప్పక హాజరు కావాలని కోరుతున్నాను అఖిలభారత పార్టీమహాసభకు విజయవాడనుండి నేరుగా వెళ్ల డానికి అవసరమైన ఏర్పాట్లన్నీ సభ్యులు చేసుకొని రావాలని కోరుతున్నాను

* * *

త్రిచూర్ మునిసిపల్ చైర్మన్‌గా కాంగ్రెసు టిక్కెట్టుపై ఎన్నుకోబడిన శ్రీ పి యస్ కృష్ణఅయ్యర్, కాంగ్రెసుపార్టీ తరఫున అధికార రీత్యా పోటీచేసిన శ్రీ పి యం జోసఫ్‌ను ఓడించి గెలుపొందారు.

కేరళ ప్రదేశ్ కాంగ్రెసు నిర్మాణానికి సన్నాహాలు

ఎర్నాకుళంలో తిరుకొచ్చి, మలయాళ ప్రదేశ్ కాంగ్రెసుల సంయుక్తసమావేశం

త్రివేంద్రం, మార్చి 26

రేపు ఎర్నాకుళంలో జరుగబోతున్న తిరువాన్కూర్ - కొచ్చిన్ ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ కార్యవర్గ సమావేశంలో కేరళ ప్రదేశ్ కాంగ్రెసును ఏర్పాటుచేసే విషయమై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు

ఈ సమావేశానికి మలయాళ ప్రదేశ్ కాంగ్రెసుకమిటీ ప్రతినిధులు కూడా ఆహ్వానించబడ్డారు.

ఉభయప్రదేశ్ కాంగ్రెసు కమిటీల ప్రతినిధుల సంయుక్త సమావేశానికి కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ కె పి మాధవన్‌నాయర్ హాజరవుతారు

కేరళరాష్ట్రంలోని రాజకీయ పరిస్థితిని గురించికూడా ఈ సమావేశంలో చర్చిస్తారు

కేరళలో వెంటనే ఎన్నికలు జరపాలి

పట్టంథానుపిళ్ళె డిమాండ్

త్రివేంద్రం, మార్చి 26

తిరువాన్కూర్-కొచ్చిన్ రాష్ట్రంలో వెనువెంటనే ఎన్నికలు జరిపి తిరిగి ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని నెలకొల్పాలని ప్రజాసోషలిస్టు నాయకుడు శ్రీ పట్టం థానుపిళ్ళె డిమాండ్ చేశారు

ఇక్కడొక బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రపరిస్థితులతో పరిచయంలేని ఒక ఆఫీసర్ పరిపాలన సాగించడం ప్రజల ప్రయోజనాలకు చాల హానికరంగా పరిణమించగలదన్నారు

మంత్రివర్గ నిర్మాణానికి రాజప్రముఖ్ తనకు అవకాశాలు యిచ్చి వున్నట్లయితే యింకా ఎక్కువమంది సభ్యులు తనను బలపరచి వుండేవారని ఆయనన్నారు ఇప్పుడైనా వెంటనే ఎన్నికలు జరిపి ప్రజాతంత్ర పరిపాలన నెలకొల్పాలని ఆయన కోరారు రాష్ట్రాల బిల్లుపై తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చేందుకు ప్రజలకు అవకాశం వుండితీరాలన్నారు.

కొట్టాయమ్ మునిసిపల్ చైర్మన్‌గా వామపక్షాల అభ్యర్థి ఎన్నిక

కొట్టాయమ్, మార్చి 26

కొట్టాయమ్ మునిసిపల్ కౌన్సిల్ అధ్యక్షుడుగా వామపక్షాల ఐక్య సంఘటన అభ్యర్థి శ్రీ యస్ రాఘవకురూప్ నేడు ఎన్నుకోబడ్డారు కాంగ్రెసు అభ్యర్థిగా పోటీచేసిన శ్రీ ఎ వి జాన్‌కి 10 వోట్లు రాగా శ్రీ కురూప్‌కు 16 వోట్లు వచ్చాయి

విలీనీకరణకు బీహార్‌లో ప్రాతికూల్యం

పాట్నా, మార్చి 26

బెంగాల్-బీహార్ల విలీనీకరణ ప్రతిపాదనకు అసమ్మతిగా ఏప్రిల్ 13 వ తేదీన లాంఛనప్రాయంగా శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభించడానికి బీహార్ రాష్ట్ర ఫార్వర్డ్‌బ్లాక్ నిశ్చయించింది

రాష్ట్రకమిటీ నిన్నయిక్కడ సమావేశమై ఈ నిర్ణయాన్ని తీసుకొన్నది

బీహార్ ఫార్వర్డ్‌బ్లాక్ అధ్యక్షుడు శ్రీ కె యస్ శాండిల్య ఒకప్రకటనచేస్తూ, ఈ సమస్యపై వామపక్షాలన్నీ ఐక్యంగా పనిచేయడానికి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు

హిందుస్తాన్
మెషిన్ టూల్స్ లిమిటెడ్
జాల్‌హళ్ళిపోస్టు, బెంగుళూరు

కావలెను

(1) బెంచి ఫిట్టర్లు, (2) ఫిట్టర్ మెకానిక్సు, (3) స్క్రేపర్లు, (4) మార్కర్లు, (5) వెల్డర్లు, (6) ప్యాట్రన్ మేకర్సు, (7) కార్పెంటర్ మెకానిస్టులు, (8) ఎలెక్ట్రిషియన్లు, (9) క్రేన్ డ్రైవర్లు, (10) హీట్ ట్రీటర్సు, (11) హార్డ్ క్రోమియం ప్లేటర్లు, (12) టర్నర్లు, (13) మిల్లింగ్ మెషిన్ ఆపరేటర్లు, (14) సర్ఫేస్ మరియు సిలిండ్రికల్ గ్రైండర్లు, (15) టూల్ గ్రైండర్లు, (16) జిగ్ బోరర్సు, (17) ప్లేనర్సు, (18) గేర్ కట్టర్లు, (19) రేడియల్ డ్రిల్లింగ్ అండ్ డ్రిల్లింగ్ మెషిన్ ఆపరేటర్లు, (20) వర్టికల్ బోరింగ్ మెషిన్ ఆపరేటర్లు, (21) హారిజాంటల్ బోరింగ్ మెషిన్ ఆపరేటర్లు, (22) షేపింగ్ అండ్ స్లోటింగ్ మెషిన్ ఆపరేటర్లు, (23) గేర్ గ్రైండర్లు, (24) పెయింటర్లు, (25) స్లింజర్సు మరియు (26) సాండ్ బ్లాస్ట

జీతాలస్కేలు
1నుండి 24 నెంబర్ల ఉద్యోగాలకు రు 2/2/ నుండి రు 6/ వరకు
25 మరియు 26 నెం॥ ఉద్యోగాలకు రు 1/2 నుండి రు 2/4 వరకు

రోజుకి
జీతం, మరి
మా కంపెనీ
ఇంటర
లోను, టె
ద్వారాను
ప్రావీణ్యత
నిర్ణయించ
ప్రతివ్యక్తికి
వంగా ఇచ్చే
ధరల అల

వయస్సు 40 సం॥లకు మించవ

హైస్కూలు లెవెల్‌కు సరి నంత బేసిక్ విద్యను దరఖాస్తుదా కల్గియుండవలెను పని చేయ కావలసిన ఇంగ్లీషు భాషాపరి అదనంగా వుండవలసిన అర్హ మెషిన్ డ్రాయింగులలో అనుభవం, మరియు సామాన్యంగా వర్కుషాపుల క్యాలిక్యులేషనులు తెలిసినవారుగాను వుండవలెను వారి వారి వృత్తులలో ఏదో ఒక రికగ్నైజుడు వర్కుషాపులో మెటల్ పరిశ్రమలో గాని, కనీసం 5 సం॥ల ప్రాక్టికల్ అనుభవమున్న వారై యుండవలెను మెషిన్‌టూల్ ఇండస్ట్రీలో పూర్వానుభవమున్న వారికి ప్రాధాన్యత యివ్వబడును

అన్ని విషయాలలోను సమానత ఉన్నప్పుడు, షెడ్యూల్డు కులములకు, మరియు షెడ్యూల్డు జాతులకు చెందిన వారికి ప్రిఫరెన్సు చూపబడును

తమ స్వంత అడ్రస్‌వున్న రెండణాల పోస్టల్ కవరును పర్సనల్ మేనేజరుకు పంపి దరఖాస్తు ఫారములు పొందవచ్చును 21-4-1956 తేదీకి గాని అంతకుముందుగా గాని, రు 0-8-0 విలువగల పోస్టల్ ఆర్డరుతో జతపర్చి పూర్తిచేసిన దరఖాస్తు ఫారములు అందవలెను. ఒకటికంటె ఎక్కువ ఉద్యోగములకు దరఖాస్తు చేయువారు వేర్వేరు దరఖాస్తులు, వాటి రుసుముతోసహా దరఖాస్తులు పంపవలెను

ప్రభుత్వ సర్వీసులో గాని, ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలలో గాని పనిచేస్తున్న వారైతే వారిడిపార్టుమెంటల్ అధిపతుల ద్వారా దరఖాస్తులు పంపవలెను

బయట ప్రాంతాలనుండి సెలెక్టు కాబడిన అభ్యర్థులకు, ఇంటర్వ్యూలకు మరియు టెస్టు పరీక్షలకు సింగిల్ రిటరన్ థర్డ్‌క్లాస్ రైల్వేఛార్జీ యివ్వబడును

పర్సనల్ మేనేజరు.

ఈస్టుకోస్టు బ్యాడ్‌మిన్‌టన్ ఛాంపియన్ షిప్
టోర్నమెంట్సు. తెనాలి

తెనాలి యన్ జి జి ఓ క్లబ్ ఆధ్వర్యాన పై టోర్నమెంట్సు 10-4-56 నుంచి జరుగును ఈవెంట్స్ - సింగిల్సు అండ్ డబుల్సు ఎంట్రీలు పంపుటకు ఆఖరుతేదీ 31-3-56 డ్రా తేదీ 1-4-56 విన్నర్సుకు బంగారు ఉంగరములు, రన్నర్సుకు వెండి కప్పులు, సెమీఫైనల్సులో ఓడిపోయిన వారికి వెండి కప్పులు ఇవ్వబడును ఇతర వివరములకు సెక్రటరీ, యన్ జి జి ఓ క్లబ్ తెనాలికి వ్రాయాలి

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త — కాట్రగడ్డ రాజగోపాలరావు—ముద్రణ స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, బకింగ్‌హాం పేట, విజయవాడ సంపాదకవర్గం — మోటూరు హనుమంతరావు, (అధ్యక్షులు) కంభంపాటి సత్యనారాయణ, కాట్రగడ్డ రాజగోపాలరావు.